# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com

ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433

E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శనివారం 23-9-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 సంపుటి :30 సంచిక: 43 పేజీలు:6 వెల: రూ.1/-


## చంద్రుడిపై విక్రమ్, ప్రజ్ఞాన్ పునరుద్ధరణ రేపటికి వాయిదా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: చంద్రుడిపై స్లీప్ మోడ్‌లో ఉన్న చంద్రయాన్-3 కు సంబంధించిన విక్రమ్ ల్యాండర్, రోవర్ ప్రజ్ఞాన్‌ను పునరుద్ధరించే ప్రణాళికలను శనివారానికి వాయిదా వేసినట్లు భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) తెలిపింది. తొలుత శుక్రవారం సాయంత్రం ల్యాండర్, రోవర్‌ను తిరిగి యాక్టివేట్ చేయాలని భావించినట్లు స్పేస్ అప్లికేషన్స్ సెంటర్ డైరెక్టర్ నీలేష్ దేశాయ్ తెలిపారు. అయితే కొన్ని కారణాల వల్ల దీనిని సెప్టెంబర్ 23న చేపడతామని చెప్పారు.

కాగా, ఇస్రో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూన్ ప్రాజెక్ట్ చంద్రయాన్-3 విజయవంతమైన సంగతి తెలిసిందే. ఆగస్ట్ 23న చంద్రుడి దక్షిణ ధృవంపై విక్రమ్ ల్యాండర్ సాఫ్ట్ ల్యాండ్ అయ్యింది. దీంతో అక్కడ అడుగుపెట్టిన తొలి దేశంగా భారత్ చరిత్ర సృష్టించింది. ల్యాండర్ నుంచి చంద్రుడి ఉపరితలంపైకి దిగిన రోవర్ సుమారు 105 మీటర్ల దూరం వరకు కదిలింది.

మరోవైపు చంద్రుడిపై లూనార్ నైట్ ప్రారంభం కావడంతో సెప్టెంబర్ 2న రోవర్‌ను, 4న ల్యాండర్‌ను స్లీప్ మోడ్‌లో ఇస్రో ఉంచింది. అయితే శుక్రవారం నుంచి చంద్రుడిపై తిరిగి లూనార్ డే ప్రారంభమైంది. దీంతో నిద్రావస్థలో ఉన్న ల్యాండర్, రోవర్‌ను తిరిగి యాక్టివ్ చేసే చర్యలను శనివారానికి ఇస్రో వాయిదా వేసింది.

కాగా, లూనార్ నైట్ సందర్భంగా చంద్రుడి దక్షిణ ధృవం వద్ద ఉండే మైనస్ 200 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు, అక్కడి వాతావరణ పరిస్థితులను తట్టుకుని ఇవి తిరిగి పని చేస్తాయా అన్నది సందిగ్ధంగా మారింది. ఒకవేళ విక్రమ్ ల్యాండర్, ప్రజ్ఞాన్ రోవర్ తిరిగి పని చేస్తే భారత్ మరో చరిత్ర సృష్టించినట్లు అవుతుంది.

## పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకే గృహలక్ష్మి పథకం : ఎమ్మెల్యే ధర్మారెడ్డి



వరంగల్, సెప్టెంబర్ 22: పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం గృహలక్ష్మి పథకానికి శ్రీకారం చుట్టిందని పరకాల ఎమ్మెల్యే చల్లా ధర్మారెడ్డి అన్నారు. గీసుగొండ మండలంలోని ఎస్.ఎస్.గార్డెన్స్ లో వివిధ గ్రామాలకు చెందిన 432 మంది గృహలక్ష్మి లబ్ధిదారులకు మంజూరు పత్రాలను జిల్లా కలెక్టర్ ప్రావీణ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..గృహలక్ష్మి పథకం ద్వారా ఒక్కొక్కరికి రూ. 3 లక్షల సాయం అందించనున్నామని తెలిపారు.

దరఖాస్తుల ఆధారంగా ప్రత్యేక బృందాలు సర్వే చేసి జాబితాను పారదర్శకంగా రూపొందించామన్నారు. మొదటి విడతలో లబ్ధి పొందని వారు నిరాశపడొద్దని, గృహలక్ష్మి పథకం నిరంతర ప్రక్రియ అని పేర్కొన్నారు. రాష్ట్రంలో సొంతిల్లు లేని పేదవారి కల నెరవేర్చడమే లక్ష్యంగా చేసుకొని గృహలక్ష్మి పథకాన్ని సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టారని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి గృహలక్ష్మి పథకం వర్తింప చేస్తామని తెలిపారు.

ఈ పథకంపై ప్రతిపక్ష పార్టీలు చేస్తున్న దుష్ప్రచారాలు ఎవరు నమ్మవద్దని సూచించారు. గత ప్రభుత్వాల హయాంలో వారి అనుచరులకు పథకాలు అందజేశారు కానీ, ప్రజలకు చేసిందేమీ లేదని విమర్శించారు. నేడు సీఎం కేసీఆర్ పాలనలో సంక్షేమ ఫలాలు పార్టీలకు అతీతంగా, పారదర్శకంగా ప్రజలకు నేరుగా లబ్ధిదారులకు అందుతున్నాయని చెప్పారు.

## భారత్ కెనడా మధ్య ఉద్రిక్తతలు.. భారీగా పెరిగిన విమాన ఛార్జీలు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:కెనడాలో భారత్ వ్యతిరేక కార్యకలాపాలు అంతకంతకూ పెరుగుతున్నాయి. ఖలిస్థానీ ఉగ్రవాది హర్దీప్ సింగ్ నిజ్జర్ హత్య విషయంలో రెండు దేశాల మధ్య ఉద్రిక్తతలు ఉద్ధృతమవుతున్నాయి. నిజ్జర్ హత్యలో భారత్ పాత్ర ఉందంటూ కెనడా ప్రధాని జస్టిన్ ట్రూడో చేసిన ఆరోపణలతో రెండు దేశాల మధ్య వివాదం రాజుకుంది. ఆ వెంటనే ఇరు దేశాలు రాయబారులను బహిష్కరించుకోవడం.. కెనడియన్లకు ఇచ్చే వీసాలను భారత్ తాత్కాలికంగా నిలిపివేయడంతో పరిస్థితి మరింత తీవ్రంగా మారింది.

ఈ నేపథ్యంలోనే ఇరు దేశాల మధ్య రాకపోకలు సాగించే వారు తీవ్ర ఆందోళనకు గురవుతున్నారు. ఈ క్రమంలోనే టికెట్లు బుక్ చేసుకునేందుకు ఎగబడుతుండటంతో విమాన టికెట్ల ధరలు చుక్కలు చూపిస్తున్నాయి. ప్రస్తుతం భారత్ కెనడాల మధ్య విమాన ప్రయాణాలకు భారీగా డిమాండ్ పెరిగింది. ఇక దీంతో ఒక్కసారిగా భారత్ కెనడాల మధ్య విమాన టికెట్ల ధరలు భారీగా పెరిగాయి.

ఇరు దేశాల మధ్య ప్రస్తుతం నెలకొన్న వివాదం కారణంగా చాలా మంది ప్రయాణికులు తమ పర్యటనల్లో మార్పులు చేసుకోవడంతో విమాన ప్రయాణాలు అకస్మాత్తుగా పెరుగుతున్నట్లు ట్రావెల్ ఏజెన్సీలు అభిప్రాయాలు వ్యక్తం చేస్తున్నాయి. గతంతో పోలిస్తే ప్రస్తుతం భారత్ కెనడాల మధ్య విమాన టికెట్ ధరలు 25 శాతానికి పైగా పెరిగినట్లు ట్రావెల్ ఏజెన్సీ వర్గాలు చెబుతున్నాయి. దీంతో చివరి నిమిషంలో భారీగా టికెట్ బుకింగ్స్ చేసుకున్నట్లు వెల్లడించాయి.

### నేటి కందం- నేటికి అందం




## ఏస్ షర్మిలకు షాక్ - బీఆర్ఎస్‌లో చేరనున్న ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న



హైదరాబాద్, సెప్టెంబర్ 22: వైఎస్ షర్మిల వైఎస్ఆర్ తెలంగాణ పార్టీకి ఝలక్ ఇస్తూ.. ప్రజాగాయకుడు ఏపూరి సోమన్న బీఆర్ఎస్‌లో చేరున్నారు. ఆయన గులాబీ కండువా కప్పుకోవడం ఖరారు అయ్యింది. ఈ మేరకు చేరికకు ముందర ఇవాళ బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావును మర్యాదపూర్వకంగా కలిశారాయన. సోమన్నను ఆత్మీయ ఆలింగనం చేసుకున్న కేటీఆర్.. సదరు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు..

రెండేళ్ల కిందట ఆయన వైఎస్సార్‌టీపీలో చేరారు. అప్పటి నుంచి ఆయన షర్మిల వెంట నడుస్తూ వస్తున్నారు. ఏపూరి సోమన్న నిన్నటి దాకా వైఎస్సార్‌టీపీ తరపున తన సొంత నియోజకవర్గం తుంగతుర్తి ఎమ్మెల్యే అభ్యర్థిగా ప్రచారం చేసుకుంటూ వచ్చారు. ఈ క్రమంలో వైఎస్సార్‌టీపీకి ఝలక్ ఇస్తూ.. టిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే బాల్క సుమన్, ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్, సీనియర్ నాయకులు దాసోజు శ్రవణ్ సమక్షంలో ఇవాళ కేటీఆర్‌ను కలిశారు. సోమన్న అంతకు ముందు ఆయన కాంగ్రెస్‌లోనూ పని చేశారు. ఆ టైంలో రేవంత్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడిగా నడుచుకున్నారు. రేవంత్ పాదయాత్రలోనూ పాల్గొని సోమన్న తన గళం వినిపించారు ఇక సోమన్న పాటలకు తెలంగాణ వ్యాప్తంగా అభిమానులు ఉన్నారు.

## మాదకద్రవ్యాల వాడకం ప్రమాదకరమైన వ్యసనం- రాజేంద్రనగర్ డిసిపి జగదీశ్వర్ రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 22:విద్యార్థులు తమ బంగారు భవిష్యత్తును మాదకద్రవ్యాల వాడకం వలన నిర్వీర్యం చేసుకోవద్దని రాజేంద్రనగర్ డిసిపి జగదీశ్వర్ రెడ్డి తెలిపారు

శుక్రవారం శంకర్పల్లి మండల పరిధిలోని ఇక్ఫాయి బిజినెస్ స్కూల్ లో విద్యార్థులకు మాదకద్రవ్యాల వాడకం పర్యవసానాలు పై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు సేవించడం వలన మీ బంగారు భవిష్యత్తు నాశనం అయిపోతుందని నీ తల్లిదండ్రుల కలలు కలలుగా మిగిలిపోతాయని హెచ్చరించారు . ఒకరు మాదకద్రవ్యాలకు బానిస అయితే వాటికోసం ఆ వ్యక్తి ఎంతటి దౌర్భాగ్య కరమైన పనులను చేయడానికి సిద్ధ మవుతాడ ని ఆయన అన్నారు . మాదక ద్రవ్యాలను సేవించడం వాటిని దగ్గర ఉంచుకోవడం ఇతరులతో పంచుకోవడం చట్టరిత్యా నేరం అని , వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని అంటూ చదువుపై దృష్టి కేంద్రీకరించాలని విద్యార్థులకు ఆయన సూచించారు

## బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయం : మంత్రి పువ్వాడ



ఖమ్మం, సెప్టెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): తెలంగాణలో వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, బీఆర్ఎస్ హ్యాట్రిక్ విజయం ఖాయమని రవాణాశాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ధీమా వ్యక్తం చేశారు. ఖమ్మం నగరంలోని భక్తరామదాసు కళాక్షేత్రంలో శుక్రవారం ఆయన 398 మందికి జీవో 58 ఇళ్ల పట్టాలు, 230 మంది లబ్ధిదారులకు 'గృహలక్ష్మి' ప్రొసీడింగ్ పత్రాలు అందించి మాట్లాడారు. ప్రజాబలం బీఆర్ఎస్‌కే ఉందన్నారు.

సీఎం కేసీఆర్ మూడోసారి ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరిస్తారన్నారు. ప్రభుత్వ స్థలాల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్న పేదలకు గూడు ఇవ్వాలనే ఉద్దేశంతో ప్రభుత్వం ప్రత్యేక జీవో తీసుకువచ్చి ఆయా స్థలాలకు పట్టాలు అందిస్తున్నదన్నారు. సొంత స్థలం ఉండి ఆర్థిక స్తోమత లేక ఇల్లు కట్టుకునే వారికి రూ. 3 లక్షల ఆర్థిక సాయం అందించేందుకే గృహలక్ష్మి పథకాన్ని అమలు చేస్తున్నదన్నారు. అనంతరం మంత్రి నగరంలోని 52వ డివిజన్‌లో పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేశారు. ఖమ్మం ప్రధాన దవాఖానను సందర్శించి ప్రజలకు అందుతున్న వైద్యసేవలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి వారికి అందుతున్న సేవలపై ఆరా తీశారు.

మంత్రి వెంట ఖమ్మం కలెక్టర్ వీపీ గౌతమ్, రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, ఖమ్మం నగర మేయర్ పునుకొల్లు నీరజ, స్తంభాద్రి అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ చైర్మన్ బచ్చు విజయ్‌కుమార్, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, నగరపాలక సంస్థ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ డి.మధుసూదన్ నాయక్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు ఉన్నారు.

## మైనార్టీల సంక్షేమంలో తెలంగాణ నంబర్ వన్ : మంత్రి జగదీష్ రెడ్డి



సూర్యాపేట, సెప్టెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): మైనార్టీల సంక్షేమంలో దేశంలోనే తెలంగాణ రాష్ట్రం నంబర్ వన్‌గా నిలించిందని విద్యుత్ శాఖ మంత్రి జగదీష్ రెడ్డి పేర్కొన్నారు. సూర్యాపేటలోని పి.ఎస్.ఆర్ సెంటర్ వద్ద గల చిన మజీద్ సమీపంలో రూ. 80లక్షల వ్యయంతో నిర్మించనున్న మైనార్టీ కమ్యూనిటీ హాల్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. గతంలో పరిపాలి ంచిన పార్టీలు ముస్లింలను కేవలం ఓటుబ్యాంక్ గానే చూశాయి తప్పా వారి సంక్షేమాన్ని పట్టించుకోలేదన్నారు. స్వాతంత్ర్యం వచ్చి ఆరు దశాబ్దాలు దాటినా మైనార్టీల బతుకులు మార లేదు. వారి జీవితాల్లో వెలుగులు కానరాలేదన్న మంత్రి, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ముస్లిం సోదరుల జీవితాల్లో వెలుగులు నిండాయని పేర్కొన్నారు. సీఎం కేసీఆర్ ప్రభుత్వం మైనారిటీల అభ్యున్నతికి అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నదన్నారు. షాదీముబారక్, మైనారిటీ గురుకులాలు, ఓవర్సీస్ స్కాలర్‌షిప్‌లు, ఇమామ్, మౌజన్‌కు గౌరవవేతనం, హజ్ యాత్రికులకు ఏర్పాట్లు, పోటీ పరీక్షలకు ఉచిత శిక్షణలాంటి అనేక కార్యక్రమాలు మైనారిటీల ప్రగతికి మైలురాయిగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ల అన్నపూర్ణమ్మ, మౌలానా అత్తర్ సాబ్, గాయాజ్ బాయ్, ఆఫీజ్ ఖలీల్ సాబ్, రియాజ్, కౌన్సిలర్లు తాహెర్ పాష, జహీర్, గండూరి రాధిక, షాదీ ఖానా చైర్మన్ సయ్యద్ సలీం, షాహద్ మౌలానా, అజీజ్, గౌస్ ఖాన్, తాహేర్, గౌస్, నజీర్, తదితరులు పాల్గొన్నారు

## పేదల ముఖాల్లో నవ్వులు పూయించిన ఘనత కేసీఆర్‌దే : మంత్రి వేముల



నిజామాబాద్, సెప్టెంబర్ 22:తెలంగాణ రాష్ట్రానికి పెద్ద దిక్కు సీఎం కేసీఆర్ అని మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. కేసీఆర్ సంక్షేమ పథకాలతో ప్రతి ఇంటా సంబురం నెలకొందని, 60 ఏళ్ల గోసను తీర్చి..తెలంగాణ ముఖం తెరువు చేసింది కేసీఆర్ మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. కమ్మర్‌పల్లి మండలంలో శుక్రవారం మంత్రి పర్యటించి సుమారు 10 కోట్ల విలువగల పలు అభివృద్ధి పనుల శంకుస్థాపన చేసి మాట్లాడారు.

రైతుబంధు, రైతుబీమా, 24 గంటల ఉచిత కరెంట్, కల్యాణ లక్ష్మి,కేసీఆర్ కిట్, ఆసరా పెన్షన్లు, కుల వృత్తులకు ప్రోత్సాహంతో రైతులు,పేదలు, కుల వృత్తుల మోహాల్లో చిరునవ్వు పూయించిన ఘనత సీఎం కేసీఆర్‌దే అని అన్నారు. సీఎం కేసీఆర్ కంటే ముందు 10ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ కేసీఆర్ ఇప్పుడు ఇస్తున్న సంక్షేమ పథకాలు అప్పుడు ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. గ్యారంటీ లేని కాంగ్రెస్ పార్టీ గ్యారెంటీలు ప్రజలను మభ్య పెట్టేవే అన్నారు.

మన జీవితాల్లో వెలుగులు నింపిన కేసీఆర్‌ను కాదని..కరెంట్ కోతల, కారు చీకట్ల కాంగ్రెస్‌ను కోరుకుంటమా అని అన్నారు. కాంగ్రెస్ చెప్పిన హామీలు ఇప్పుడు అధికారంలో ఉన్న రాష్ట్రాల్లోనే ఇస్తలేరు. తెలంగాణలో ఎట్లా ఇస్తరని ప్రశ్నించారు. కేసీఆర్.. ప్రజలకు ఏమీ కావాలో అది చేస్తడు కానీ అలివికాని హామీలు ఇవ్వడని స్పష్టం చేశారు. కాంగ్రెస్ పెట్టిన గోసలు..బీజేపీ చేసిన మోసం రైతులు ఎన్నటికీ మర్చిపోరన్నారు.

కోడి గుడ్డు మీద ఈకలు పీకే కాంగ్రెస్,బీజేపీ నాయకుల మోసపు మాటల పట్ల చాలా జాగ్రత్తగా ఉండాలని ప్రజలను కోరారు. ఆయా గ్రామాల్లో ప్రజలు తన దృష్టికి తెచ్చిన అభివృద్ధి పనులపై చర్యలు చేపడతానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు భాస్కర్ యాదవ్, కోటపాటి నర్సింహా నాయుడు, స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## మంత్రి కొప్పులను కలిసిన ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ వెంకటయ్య



హైదరాబాద్, సెప్టెంబర్ 22: రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ నూతన చైర్మన్ బక్కి వెంకటయ్య ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ను మర్యాదపూర్వకంగా కలిశారు. తనను ఎస్సీ, ఎస్టీ కమిషన్ కమిషన్ చైర్మన్‌గా ప్రభుత్వం నియమించడం పట్ల డా.బీఆర్ అంబేద్కర్ సచివాలయంలో శుక్రవారం మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను కలిసి కృతజ్ఞతలు తెలిపారు. మంత్రి కొప్పుల వెంకటయ్యను అభినందించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల్లో తనవంతు సహకారం అందిస్తానని మంత్రి చెప్పారు.

కాగా, కమిషన్‌కు నూతన చైర్మన్, సభ్యులను సీఎం కేసీఆర్ నియమించిన విషయం తెలిసిందే. కమిషన్ నూతన చైర్మన్‌గా మెదక్ జిల్లాకు చెందిన బక్కి వెంకటయ్య (ఎస్సీ మాల), సభ్యులుగా కుస్రం నీలాదేవి (ఎస్టీ గోండు, ఆదిలాబాద్), రాంబాబు నాయక్ (ఎస్టీ లంబాడా, దేవరకొండ), కొంకటి లక్ష్మీనారాయణ (ఎస్సీ మాదిగ, కరీంనగర్), జిల్లా శంకర్ (ఎస్సీ మాదిగ, నల్లగొండ), రేణికుంట ప్రవీణ్ (ఎస్సీ మాదిగ, ఆదిలాబాద్)ను నియమిస్తూ సీఎం కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది.

## సబ్బండ వర్ణాల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం : మంత్రి ఎర్రబెల్లి

మహబూబాబాద్, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): బీఆర్ఎస్ ప్రభుత్వం సబ్బండ వర్గాల సంక్షేమం కోసం పాటుపడుతున్నది. సీఎం కేసీఆర్ అన్ని వర్గాల ప్రజలను సమంగా చూస్తున్నారని పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు అన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలోని తొర్రూరు పట్టణంలో రూ.2 కోట్లతో నిర్మించనున్న ఆధునిక దోభీఘాట్ల నిర్మాణానికి శంకుస్థాపన, బుడగ జంగాల సంక్షేమ భవన్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు.

అలాగే తొర్రూరులో బుడిగ జంగాల సంక్షేమ భవనానికి శంకుస్థాపన చేశారు. బుడగజంగాలు భారీ బైక్ ర్యాలీ నిర్వహించగా మంత్రి స్వయంగా బైక్ నడిపి బుడగ జంగాల యువకులను ఉత్తేజపరిచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..అడుగంటిపోయిన కులవృత్తులకు సీఎం కేసీఆర్ పునర్జీవం పోశారు. ఆయా కులాలు వృత్తుల వారీగా వారి ప్రాధాన్యతలను పట్టి వారిని ప్రోత్సహిస్తున్నారని చెప్పారు.

త్వరలోనే రజక సంక్షేమ భవనాన్ని కూడా నిర్మించి తొర్రూరు పట్టణంలో చాకలి ఐలమ్మ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తామని హామీనిచ్చారు. మీరు బీఆర్ఎస్‌కు అండగా నిలవండి. మీకు ఎల్లప్పుడూ అండదండలు అంది స్తామని చెప్పారు. ఈ కార్యక్రమాలలో జిల్లా కలెక్టర్ శశాంక, స్థానిక ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.




# ఖలిస్థానీ మంటల్లో భారత్ - కెనడా సంబంధాలు

భారతదేశ 'మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాదుల' జాబితాలో ఉన్న కెనడాకు చెందిన నిషేధిత ఖలిస్థానీ టైగర్ ఫోర్స్ (కెటిఎఫ్) నేత హర్‌దీప్ నిజ్జర్ ఉండడమే కాకుండా తన తలపై 10 లక్షల రికార్డు కూడా భారత్ ప్రకటించినా విషయం మనకు తెలుసే ఉంది. 18 జూన్ 2023న కెనడాలోకి 'సర్రే' నగరంలోని ఒక గురుద్వారా ఎదుట ఇద్దరు గుర్తు తెలియని దుండగులు నిజ్జర్‌ని దారుణంగా కాల్చి చంపగా, ఈ హత్య వ్యవహారంలో భారత ఏజెంట్ల ప్రమేయం ఉండవచ్చని కెనడా ప్రధానమంత్రి 'జస్టిన్ ట్రూడో' చేసిన ఆరోపణతో రెండు దేశాల మధ్య సంబంధాల్లో తీవ్ర స్థాయిలో చిచ్చు రేగింది. పంజాబ్ జలంధర్‌కు చెందిన 45 ఏండ్ల నిజ్జర్‌పై హిందూ పూజారిని హత్య చేశారని, 2007లో పంజబ్‌లో బాంబులు వేసిన కేసుతో పాటు యూకె/కెనడాల్లో దౌత్య సిబ్బందిపై దాడులకు ప్రయత్నించాడనే ఆరోపణలు అనేకం ఎదుర్కొంటున్నాడు. అదే కాకుండా భారత్‌కు వ్యతిరేకంగా కుట్రలు పన్నుతున్న ఉగ్రవాద గ్రూపులతో సంబంధాలు కూడా కలిగి ఉన్నాడనే ఆరోపణలతో భారతదేశ మోస్ట్ వాంటెడ్ ఉగ్రవాద జాబితాలో చేరారు.

ఖలిస్థానీ ఉగ్రవాది హర్‌దీప్ నిజ్జర్ రక్తచరిత్ర:

నిజ్జర్ హత్యకు సంబంధించిన నిరాధార ఆరోపణలను ఖండించిన భారత ప్రభుత్వం తమ భద్రతా సంస్థలచే వివరాలను సేకరిస్తున్న సమయంలోనే కెనడాలోని దౌత్య కార్యాలయంలో పని చేస్తున్న మన 'రీసెర్చ్ అండ్ అనాలిసిస్ (రా)' వింగ్ అధిపతి 'పవన్ కుమార్ రాయ్'ను బహిష్కరిస్తున్నట్లు కెనడా విదేశాంగ మంత్రి ప్రకటించడం, దీనికి ధీటుగా కెనడా ఆరోపణలను ఘాటుగా వ్యతిరేకిస్తూ భారత్‌లోని కెనడా దౌత్య కార్యాలయంలోని హైకమిషనర్ 'మెక్కెనూ' మన విదేశాంగ మంత్రిత్వ కార్యాలయానికి పిలిపించి, ఒక కెనెడియన్ దౌత్యవేత్త 'ఒలివియర్ సిల్వెస్టర్'ను బహిష్కరిస్తున్నట్లు, ఐదు రోజుల్లో భారత్‌ను వదలి వెళ్లాలంటూ అధికారికంగా ప్రకటించడంతో కెనడా–భారత్‌లో మధ్య ఢీ అంటే ఢీ అనే అనిశ్చిత వాతావరణం నెలకొంది. కెనడా పౌరులకు వీసాల మంజూరులను పలు ఆపరేషనల్ కారణాలతో తాత్కాలికంగా సస్పెండ్ చేస్తున్నట్లు తాజాగా భారత్ ప్రకటించడం కొస మెరుపు. ఖలిస్థానీ ఉగ్రవాదులకు కెనడాకు చెందిన పాకిస్తాన్ ఉగ్ర సంస్థలు కూడా భారీ నిధులు అందిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ తాజాగా ప్రకటించడం పరిస్థితి తీవ్రతకు అద్దం పడుతున్నది. జీ20 సమావేశాల వేదికగా రెండు దేశాల ప్రధానమంత్రులు ఈ విషయాల పట్ల చర్చించుకోవడం, భారత్ సదా విశ్వ శాంతిని కోరుకుంటుందనే తన అభిప్రాయాలను ధీటుగా వివరించడం, కెనడాలో భారత వ్యతిరేక కార్యకలాపాలను ఏకోశానా ఉపేక్షించమని కూడా మన ప్రధాని తెలుపడం జరిగిపోయింది. ఈ పరిణామంతో గత 13 ఏండ్లుగా కొనసాగుతున్న 'స్వేచ్ఛా వాణిజ్య ఒప్పంద చర్చలు' నిలిచిపోయాయని ఇరు దేశాలు ప్రకటించాయి. వేర్పాటువాద ఉలిస్థానీ కార్యకలాపాలు పెరడమనే అంశమే రెండు దేశాల మధ్య మంటలు రేపాయి.

కెనడాలో సిక్కుల జనాభా 7 లక్షలు:

ఉత్తర అమెరికాలోని కెనడా విస్తీర్ణంలో ప్రపంచంలోనే రెండవ అతి పెద్ద దేశంగా పేరొందింది. సార్వభౌమిక పార్లమెంటరీ ప్రజాస్వామ్య కెనడాలో రాజ్యాంగబద్ధమును రాచరిక పాలన అమలు అవుతున్నది. ద్విభాషా, బహుసంస్కృతులు కలిగిన కెనడా దేశ జనాభా 3.9 కోట్లు ఉండగా, అందులో భారత సంతతికి చెందిన జనాభా 15 లక్షలు (అనగా దాదాపు 4 శాతం) ఉన్నది. ప్రతి ఏట 1.2 లక్షల భారతీయులకు శాశ్వత నివాసం(పిఆర్) కల్పిస్తున్నారు. భారత్ తర్వాత సిక్కుల జనాభా అత్యధికంగా 7 లక్షలు ఉన్న దేశంగా కెనడాకు పేరుంది. కెనడాలోని సిక్కుల్లో ఉలిస్థానీ ఉగ్రవాదులు కూడా ఉండడం, భారత వ్యతిరేక వేర్పాటువాద కార్యకలాపాలను వేగిరపరచడం జరుగుతున్నది. కెనడాలోని హిందువులపై బెదిరింపులు, దేవాలయాలపై దాడులకు యత్నాలు కూడా కొనసాగుతున్నాయి. భారత వ్యతిరేక రాజకీయ ప్రేరేపిత విద్వేష నేరాలు కెనడాలోని పెరుగుతున్నందున ప్రవాస భారతీయులు, ఇక్కడి నుంచి వెళుతున్న పౌరులు, ముఖ్యంగా విద్యార్థులు ఖలిస్థానీ ఉగ్రవాదుల పట్ల అప్రమత్తంగా ఉండాలని మన విదేశాంగ శాఖ హెచ్చరించడం వరకు పరిస్థితులు దిగజారడం విచారకరం.

సిక్కుల ఓటుబ్యాంక్‌తో కెనడా ప్రభుత్వ మెతక వైఖరి:

ఖలిస్థానీ అనుకూల భారత వ్యతిరేకవాదులపై చర్యలు తీసుకున్న యెడల తమ బలమైన సిక్కుల ఓట్లు పడవనే భయంతో కెనడా ప్రభుత్వం ప్రేక్షక పాత్ర వహిస్తూ తమాషా చూస్తున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కెనడా ప్రభుత్వ మెతక వైఖరి అనే బలహీనతను ఆసరాగా తీసుకుంటూ ఖలిస్థానీ ఉగ్రమూకలు కెనడా నుంచి వేర్పాటువాద కార్యకలాపాలు కొనసాగిస్తున్నారని అర్థం అవుతున్నది. ఈ ఉద్రిక్త పరిస్థితులు ఇలాగే కొనసాగితే రెండు దేశాల మధ్య వాణిజ్య సంబంధాలు కూడా దెబ్బతినే అవకాశాలు లేకపోలేదు. కెనడా ప్రభుత్వం ఉగ్రవాద కోరలు కలిగిన ఖలిస్థానీ వేర్పాటువాదులను పెంచి పోషిస్తే రాబోయే రోజుల్లో అదే పాము కెనడాను కూడా కాటేసే ప్రమాదం ఉందని ఆ దేశ అగ్ర నాయకులు భావించాలి. ప్రపంచమే కుగ్రామమైన డిజిటల్ యుగంలో శాంతి సౌభ్రాతృత్వాలే ప్రగతికి పునాదులని, ఏ దేశంలో అలజడి జరిగినా ప్రపంచ దేశాలు ప్రభావితం అవుతాయని గమనిస్తూ కెనడా–భారత్‌ల మధ్య పుర్వపు స్నేహశీల సంబంధాలు త్వరలో నెలకొనాలని, సుస్థిరాభివృద్ధి దిశగా వడివడిగా అడుగులు పడాలని కోరుకుందాం.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## రాజ్యసభలో రాజ్యాంగ బిల్లు, 2023ను సమర్థించవలసిందిగా నేతల కు విజ్ఞప్తి చేసిన ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:రాజ్యాంగ (నూట ఇరవై ఎనిమిదో సవరణ) బిల్లు, 2023 ను గురించి రాజ్య సభ లో జరిగిన చర్చ ఆఖరు లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ మాట్లాడారు. ఈ సందర్భం లో ఆయన, గత రెండు రోజులు గా పార్లమెంటు ఉభయ సభల లో జరిగిన చర్చలు మరియు వాదోపవాదాలు అర్థవంతమైనవి గా ఉన్నాయన్నారు. ఈ చర్చల లో సుమారు గా 132 మంది గౌరవనీయ సభ్యులు వారి వారి అభిప్రాయాల ను వెల్లడించారు. "ఈ చర్చ లో ఆడిన ప్రతి మాట కు తనదైన ప్రాముఖ్యం మరియు అర్థం ఉన్నాయి" అని ప్రధాన మంత్రి అన్నారు. ఈ అర్థవంతమైనటువంటి చర్చ లు దేశం యొక్క భావి పార్లమెంటరీ యాత్ర కు ఎంతో ఉపయోగకరం గా నిలుస్తాయి అని ఆయన నొక్కి చెప్పారు.

ఈ బిల్లు ను సమర్ధించిన సభా సభ్యుల కు ప్రధాన మంత్రి ధన్యవాదాల ను తెలిపారు. "ఈ యొక్క ఉత్సాహం దేశ ప్రజల లో ఒక క్రొత్త ఆత్మవిశ్వాసాన్ని జనింప చేస్తుంది. మరి సభ్యులు అందరు, అలాగే అన్ని రాజకీయ పక్షాలు చాలా ముఖ్యమైనటువంటి పాత్ర ను పోషించాయి." అని ఆయన అన్నారు. ఈ బిల్లు కు ఆమోదం లభించడం తో మహిళా శక్తి కి ప్రత్యేకమైన ఆదరణ లభిస్తున్నట్లు కాదు కానీ ఈ బిల్లు పట్ల రాజకీయ పక్షాలన్నిటి సకారాత్మకమైన ఆలోచన తో మన దేశం లోని నారీ శక్తి లో ఒక సరిక్రొత్త ఉత్తేజం ప్రవహిస్తోందని ఆయన అన్నారు. ఈ బిల్లు భారతదేశం యొక్క ప్రకాశవంతమైనటువంటి భవిష్యత్తు కు భరోసా ను కల్పిస్తుంది. ఎందుకు అంటే ఈ బిల్లు నాయకత్వం తో ముందడుగు ను వేయడం తో పాటు గా సరిక్రొత్త విశ్వాసం తో దేశ నిర్మాణ దిశ లో తోడ్పాటు ను అందిస్తుంది అని కూడా ఆయన అన్నారు.

ప్రధాన మంత్రి తన ప్రసంగాన్ని ముగిస్తూ, చర్చ ఆసాంతం వ్యక్తం చేసినటువంటి అభిప్రాయాల కు గాను కృతజ్ఞత ను తెలిపారు. ఎగువ సభ ఏకగ్రీవం గా సమర్ధిస్తూ వోటు వేసి బిల్లు ను ఆమోదించవలసింది అంటూ ఆయన విజ్ఞప్తి ని చేశారు.

## చంద్రబాబు అరెస్ట్‌ను నిరసిస్తూ పాదయాత్ర



అమరావతి, సెప్టెంబర్ 22:చంద్రబాబు అక్రమ అరెస్టుకు నిరసనగా, వెంటనే ఆయన్ను విడుదల చేయాలని కోరుతూ పలమనేరు తెలుగుదేశం పార్టీ నాయకులు శుక్రవారం పాదయాత్ర నిర్వహించారు. గంగవరం మండల కేంద్రంలోని ఫ్లైఓవర్ (ఎన్టీఆర్ సర్కిల్) నుంచి కీలపట్లలోని కోనేటి రాయ స్వామి ఆలయం వరకు పాదయాత్ర కొనసాగించారు. ఈ సందర్భంగా ఫ్లైఓవర్ వద్ద వెంకటేశ్వర స్వామి చిత్రపటానికి పూజలు చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు.

అనంతరం కోనేటి రాయ స్వామి ఆలయంలో స్వామివారి దర్శనానంతరం మాజీ ముఖ్య మంత్రి చంద్రబాబు నాయుడు, వెంటనే విడుదల కావాలని ఆకాంక్షిస్తూ టెంకాయలను కొట్టి స్వామివారిని వేడుకున్నారు మాజీ మంత్రి అమర్నాథ్ రెడ్డి . తదనంతరం ఆలయం ఎదుట గంగవరం మండల పార్టీ అధ్యక్షులు సోమశేఖర్ గౌడ్, పలమనేరు పట్టణ అధ్యక్షులు ఆర్బీసీ కుట్టి, నియోజకవర్గం ఎస్సీ సెల్ అధ్యక్షులు నాగరాజులు వైకాపా ప్రభుత్వ కక్షపూరిత చర్యలను ఎండగట్టారు. ఈ కార్యక్రమంలోపలమనేరు పట్టణ, గంగవరం మరియు పలమనేరు రూరల్ మండలం నాయకులు పాల్గొన్నారు.

## అత్యంత వేగంగా నియామక ప్రక్రియలు నిర్వహిస్తున్న బొగ్గు పీఎస్‌యులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:యువతకు ఉద్యోగావకాశాలు కల్పించడం, పౌరుల సంక్షేమం కోసం పరిశ్రమించాలన్న ప్రధాన మంత్రి నిబద్ధతను నెరవేర్చడంలో భాగంగా, బొగ్గు మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని కోల్ ఇండియా లిమిటెడ్, ఎన్‌ఎల్‌సీఐఎల్ విజయవంతంగా నియామక ప్రక్రియలు చేపట్టాయి. 2022 జులై నుంచి అత్యంత వేగంగా నియామక ప్రక్రియ కొనసాగించాయి. 2023 ఆగస్టు 21 నాటికి, కోల్ ఇండియా లిమిటెడ్, ఎన్‌ఎల్‌సీఐఎల్ లక్ష్యాలతో పోలిస్తే నియామక పత్రాల జారీలో గణనీయమైన పురోగతి కనిపించింది.

కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), నిర్విరామంగా ఏడు విడతలుగా నియామక ప్రక్రియలు నిర్వహించింది. ఈ సంస్థ మొత్తం 7,268 నియామక పత్రాలు జారీ చేసింది, 3,969 లక్ష్యాన్ని అధిగమించింది. ఇది 83.11% వృద్ధిని సూచిస్తుంది. ఈ ఏడాది ఆగస్టులో లక్ష్యం 465 కాగా, మొత్తం 574 నియామక లేఖలు జారీ అయ్యాయి.

ఎన్‌ఎల్‌సీ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎల్‌సీఐఎల్) కూడా 528 నియామక పత్రాలు జారీ చేసింది. సెప్టెంబర్ 19, 2023 నాటికి నిర్దేశించుకున్న 480 లక్ష్యాన్ని అధిగమించింది. ఇది 10% వృద్ధిని సూచిస్తుంది. 2023 జులైలో 75 నియామకాల లక్ష్యాన్ని పెట్టుకున్న ఎన్‌ఎల్‌సీఐఎల్, 149 నియామక పత్రాలను జారీ చేసింది, లక్ష్యాన్ని అధిగమించింది.

యువతకు సాధికారత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ నిబద్ధతకు ఈ విజయం గుర్తుగా నిలుస్తుంది, దేశ నిర్మాణంలో బొగ్గు పీఎస్‌యూల అంకితభావాన్ని ప్రతిబింబిస్తుంది. ఈ నియామక కార్యక్రమం ఉపాధి కల్పనలో ఉత్ప్రేరకంగా పనిచేస్తుంది, ఉజ్వల భవిష్యత్తును రూపొందించుకోవడానికి యువతకు అవకాశాలు అందిస్తుంది.

## వారణాసీని సందర్శించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:వారాణసీ ని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ 2023 సెప్టెంబర్ 23 వ తేదీ నాడు సందర్శించనున్నారు. వారాణసీ లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియమ్ కు ప్రధాన మంత్రి మధ్యాహ్నం పూట సుమారు ఒంటిగంటన్నర వేళ కు శంకుస్థాపన చేస్తారు. మధ్యాహ్నం దాదాపు గా 3 గంటల 15 నిమిషాల కు, ప్రధాన మంత్రి రుద్రాక్ష్ ఇంటర్ నేశనల్ కోఆపరేశన్ ఎండ్ కన్ వెన్శన్ సెంటరు కు చేరుకొని కాశీ సంసద్ సాంస్కృతిక్ మహోత్సవ్ 2023 యొక్క ముగింపు కార్యక్రమం లో పాలుపంచుకొంటారు. ఇదే కార్యక్రమం లో, ఆయన ఉత్తర్ ప్రదేశ్ లో లో నిర్మాణం పూర్తయిన 16 అటల్ ఆవాసీయ విద్యాలయాల ను కూడా ప్రారంభించనున్నారు.

వారాణసీ లో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియమ్ నిర్మాణం ఆధునిక ప్రపంచ శ్రేణి క్రీడల కు సంబంధించినటువంటి మౌలిక సదుపాయాల ను అభివృద్ధి పరచాలి అనేటటువంటి ప్రధాన మంత్రి దార్శనికత ను సాకారం చేసే దిశ లో ఒక అడుగు కానున్నది. వారాణసీ లోని గాంజరీ లో గల రాజా తాలాబ్ లో నిర్మించబోయే ఆధునిక అంతర్జాతీయ స్టేడియమ్ ను సుమారు 450 కోట్ల పాయల ఖర్చు తో 30 ఎకరాల కు పైబడిన క్షేత్రం లో అభివృద్ధి పరచడం జరుగుతుంది. ఈ స్టేడియమ్ యొక్క రూపు రేఖ ల రచన లో ప్రేరణ ను భగవాన్ శివుని నుండి తీసుకోవడం జరిగింది; దీనిలో నెలవంక ఆకారం లో పైకప్పు , త్రిశూలం ఆకారం లో ఫ్లడ్-లైట్ లు, నదీ స్నానఘట్టం లో మెట్ల ను పోలి ఉండేటటువంటి సీటింగు, స్టేడియమ్ ముందు భాగం లో బిల్వపత్రాల ఆకారాన్ని కలిగివున్న మెటాలిక్ శీట్స్ ను ఏర్పాటు చేయడం జరుగుతుంది. ముప్ఫయ్ వేల మంది ఈ స్టేడియమ్ లో కూర్చొని ఆటల ను చూడవచ్చు.

నాణ్యత తో కూడినటువంటి విద్య ను మరింత మంది కి అందుబాటు లోకి తీసుకు రావాలి అనే లక్ష్యం తో సుమారు 1115 కోట్ల రూపాయల ఖర్చు తో ఉత్తర్ ప్రదేశ్ లో పదహారు అటల్ ఆవాసీయ విద్యాలయాల ను ప్రారంభించడమైంది. వాటి ని శ్రమికుల పిల్లల కోసం, నిర్మాణ రంగ పనివారి పిల్లల కోసం మరియు కోవిడ్-19 వల్ల తల్లితండ్రుల ను కోల్పోయి అనాథలు అయిన పిల్లల కోసం మొదలు పెట్టడం జరిగింది. ప్రతి ఒక్క విద్యాలయాన్ని పది-పదిహేను ఎకరాల క్షేత్రం లో నిర్మించడమైంది. ఈ విద్యాలయాల లో తరగతి గదులు, ఆటలు ఆడుకోవడాని కి మైదానం, వినోద కార్యకలాపాల కు ఉపయోగించే ప్రదేశం, ఒక బుల్లి సభా భవనం, వసతి గృహ సముదాయం, భోజనశాల లతో పాటు సిబ్బంది కి నివాస గృహాలు ఉన్నాయి. ఈ ఆవాసీయ విద్యాలయాల ను రాబోయే కాలం లో ఒక్కొక్క పాఠశాల వేయి మంది విద్యార్థుల కు సరిపడా వసతి ని కలిగి ఉండాలి అని లక్ష్యం గా పెట్టుకోవడమైంది.

కాశీ యొక్క సాంస్కృతిక చైతన్యాన్ని బలపరచాలనే ప్రధాన మంత్రి దార్శనికత లో భాగం గా కాశీ సంసద్ సాంస్కృతిక్ మహోత్సవ్ కు అంకురారోపణ చేయడమైంది. మహోత్సవ్ లో 17 అంశాల లో ముప్ఫయ్ ఏడు వేల మంది కి పైగా పాల్గొని, పాటల ను పాడడం, వాద్య పరికరాల ను ఉపయోగించడం, వీధి నాటకాలు ఆడటం, నృత్యం చేయడం వంటి వాటి లో వారి యొక్క కౌశలాన్ని చాటారు. ప్రతిభావంతులైన వారికి రుద్రాక్ష్ ఇంటర్ నేశనల్ కోఆపరేశన్ ఎండ్ కన్ వెన్శన్ సెంటర్ లో వారి నేర్పు ను చాటుకొనే అవకాశం దక్కనుంది.

## దేశీయ విమానాలలో ప్రయాణించే ప్రయాణికుల సంఖ్యలో 38.27 శాతం వార్షిక వృద్ధి, 23.13 శాతం నెలవారీ వృద్ధి నమోదు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:దేశీయ విమానయాన పరిశ్రమ 2023 మొదటి ఎనిమిది నెలల్లో ప్రయాణీకుల రద్దీలో గణనీయమైన పెరుగుదలను నమోదు చేసింది. తాజా డేటా విశ్లేషణ ప్రకారం, జనవరి నుండి ఆగస్టు 2023 వరకు దేశీయ విమానయాన సంస్థలు తీసుకువెళ్లే ప్రయాణీకుల సంఖ్య 1190.62 లక్షలకు చేరుకుంది, ఇది గత ఏడాది ఇదే కాలంతో పోలిస్తే 38.27 శాతం గణనీయమైన పెరుగుదలను సూచిస్తుంది .

ఆగస్ట్ 2023 నెలలోనే 23.13 శాతం గణనీయమైన నెలవారీ వృద్ధి రేటును సాధించింది, ప్రయాణీకుల సంఖ్య 148.27 లక్షలకు పెరిగింది. ప్రయాణీకుల పెరుగుదల ధోరణి పరిశ్రమ స్థితిస్థాపకత, ప్రపంచ మహమ్మారి ద్వారా ఎదురయ్యే సవాళ్ల నుండి కోలుకోవడాన్ని ప్రతిబింబిస్తుంది.

ప్రయాణీకుల రద్దీలో ఆకట్టుకునే వృద్ధి ఉన్నప్పటికీ, ఆగస్టు 2023లో షెడ్యూల్ చేయబడిన దేశీయ విమానయాన సంస్థల మొత్తం రద్దు రేటు కేవలం 0.65 శాతం మాత్రమే కావడం గమనార్హం. ఆగస్ట్ 2023లో, షెడ్యూల్ చేసిన దేశీయ విమానయాన సంస్థల ద్వారా మొత్తం 288 ప్రయాణీకులకు సంబంధించిన ఫిర్యాదులు అందాయి, 10,000 మంది ప్రయాణీకులకు దాదాపు 0.23 ఫిర్యాదులు వచ్చాయి. ఈ తక్కువ ఫిర్యాదు, రద్దు రేటు కస్టమర్ సంతృప్తికి అద్దం పడుతుంది. అలాగే ప్రయాణీకులకు నమ్మకమైన, సమర్థవంతమైన సేవలను అందించడానికి పరిశ్రమ చేస్తున్న ప్రయత్నాలకు నిదర్శనం. ఈ రంగంలో వృద్ధిని అభినందిస్తూ కేంద్ర పౌర విమానయాన, ఉక్కు శాఖ మంత్రి శ్రీ జ్యోతిరాదిత్య ఎం. సింధియా మాట్లాడుతూ సురక్షితమైన, సమర్థవంతమైన సేవలను అందించడంలో విమానయాన సంస్థలు, విమానాశ్రయాలు, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ సమిష్టి కృషికి ఈ స్థిరమైన వృద్ధి, కస్టమర్-సెంట్రిక్ ఏవియేషన్ ఎకోసిస్టమ్ కు నిదర్శనమని అన్నారు. అభివృద్ధి చెందుతున్న ప్రయాణ డిమాండ్లు, నిబంధనలకు అనుగుణంగా ప్రయాణీకుల భద్రత, సౌకర్యాన్ని నిర్ధారించడానికి విమానయాన పరిశ్రమ కట్టుబడి ఉంది. విమాన ప్రయాణం కోలుకుంటున్నందున, దేశీయ విమానయాన సంస్థలు భారతదేశం అంతటా ఆర్థిక వృద్ధి, కనెక్టివిటీని సులభతరం చేయడంలో కీలక పాత్ర పోషించడానికి సిద్ధంగా ఉన్నాయి.

## సాయి మందిరంలో అన్నదానానికి 50వేలు విరాళం



ఖమ్మం, సెప్టెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): జూనియర్ కళాశాల సెంటర్లో ఉన్న శ్రీ సాయి బాబా వారి మందిరంలో గురువారం నాడు ఉదయం బాబా వారికి పాలతో అభిషేకం జరిపి నూతన వస్త్రాలు అలంకరించి స్వర్ణ ఆభరణాలు ధరింపజేశారు. హారతి అష్టోత్తర నామార్చన జరిగినవి. భద్రాచలం వాస్తవ్యులు కీర్తిశేషులు కోనేరు సౌభాగ్యవతి జ్ఞాపకార్థం అమెరికాలో ఉంటున్న వారి మనుమడు అందించిన విరాళంను కోనేరు జానకి ఆలయ అధ్యక్షులు తుమ్మలపల్లి సత్యనారాయణ మూర్తికి 50వేల రూపాయలు అందజేశారు. ఇచ్చిన విరాళం ఫోను గురువారం అన్నదాన ఖర్చు మరింతైనా అందజేస్తామని దాత తెలిపారు. విరాళం అందించిన దాతను శాలువాతో సత్కరించి బాబా వారి మెమెంటో అందజేశారు. వీరితోపాటు కోశాధికారి కుంచాల రమేష్, సభ్యుడు గొర్ల వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. గురువారం అన్నదానంలో 1000 మంది భక్తులు బాబా వారి అన్నప్రసాదం స్వీకరించారని అధ్యక్షులు తెలిపారు. అలాగే వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వందమందికి భోజనం అందించడం జరిగినదని అన్నారు.

## ట్రాక్టర్ ట్రాలీకి తగిలిన విద్యుత్ వైర్లు.. షాక్ తో డ్రైవర్ మృతి

అమరావతి, సెప్టెంబర్ 22:మండల కేంద్రం సమీపంలో విద్యుత్ వైర్లకు ట్రాక్టర్ ట్రాలీ తగలడంతో డ్రైవర్ మృతిచెందిన ఘటన చోటుచేసుకుంది. ఎద్దుల చెరువుకట్ట ఓంశక్తి ఆలయం చిన్నూరు గ్రామానికి వెళ్లే రహదారిలో ట్రాక్టర్ సహాయంతో మట్టిని తరలిస్తూ, ఓబావిని పూడ్చుడానికి డ్రైవర్ ప్రయత్నిస్తున్నాడు. ట్రాక్టర్ హైడ్రాలిక్ ఆన్ చేసి ట్రాలీ వెనుక ఉన్న డోర్ తీయడానికి వెళ్లగా.. ట్రాలీ పైకి లేయడంతో పైనున్న విద్యుత్ వైర్లకు తగులుకొని షాక్ కొట్టి అక్కడికక్కడే బావిలో పడి మృతిచెందాడు.

ఘటనను గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. స్థానికుల సమాచారంతో సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు అగ్నిమాపకశాఖ సిబ్బంది సహకారంతో మృతదేహం కోసం కొన్ని గంటలపాటు కష్టపడి బావిలో నుండి శవాన్ని బయటకు తీశారు.

అనంతరం పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం కోసం తరలించారు. కాగా మృతుడు పలమనేరు రూరల్ టి.ఒడ్డూరు గ్రామానికి చెందిన రజనిగా గుర్తించారు. ఆ ప్రాంతంలో మృతుని కుటుంబీకుల ఆర్తనాదాలు అక్కడున్న ప్రతి ఒక్కరినీ కలచివేశాయి.

## రెండో విడత ఎంబీబీఎస్ మెడికల్ కౌన్సిలింగ్ రద్దు చేయాలి.. కాంగ్రెస్ నేతల ఆందోళన




అమరావతి, సెప్టెంబర్ 22:రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న రెండో విడత ఎంబీబీఎస్ మెడికల్ కౌన్సిలింగ్ రద్దు చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్టీ చేసిన ఆందోళన ఉద్రిక్తలకు దారితీసింది. కౌన్సిలింగ్ రద్దు కోరుతూ వైఎస్ఆర్ హెల్త్ యూనివర్సిటీకి వెళున్న పీసీసీ శ్రేణుల్ని పోలీసులు అడ్డుకున్నారు. హెల్త్ యూనివర్సిటీ లోపలకు వెళ్లే క్రమంలో పోలీసులకు, కాంగ్రెస్ కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ నేపథ్యంలో ఆందోళన చేస్తున్న పీసీసీ, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్ యు ఐ కార్యకర్తలను పోలీసులు అరెస్ట్ చేశారు. రెండో విడత మెడికల్ కౌన్సిలింగ్‌లో జరుగుతున్న అక్రమా లను వైఎస్సార్ హెల్త్ యూనివర్శిటీ అధికారుల దృష్టికి ఏపీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు తీసుకువెళ్లారు. ఈ సందర్భంగా ఏపీసీసీ అధ్యక్షుడు రుద్రరాజు మాట్లాడుతూ ఏపీలో మెడికల్ సీట్ల భర్తీలో అక్రమాలు జరుగుతున్నాయని ఆరోపించారు. మెరుగైన ర్యాంకులు సాధించిన ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు జనరల్ క్యాటగిరీలో సీట్లు కేటాయించకుండా వారిని రిజర్వుడు స్థానాలకు పరిమితం చేస్తున్నారన్నారు. దీని వల్ల రిజర్వుడు అభ్యర్థులకు సీట్ల భర్తీలో అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. జనరల్ క్యాటగిరీలో ప్రతిభ ఆధారంగా సీట్లు భర్తీ చేయాల్సి ఉన్నా, రిజర్వేషన్ క్యాటగిరీలో కేటాయించడం వల్ల సీట్లు కోల్పోయే ప్రమాదం ఏర్పడిందన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి రెండో విడత కౌన్సిలింగ్ ను తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కొత్త మెడికల్ కళాశాలలో సీట్ల భర్తీకి 107, 108 జీఓల ద్వారా ఎంబీబీఎస్ సీట్లు అమ్మకాలు చేస్తున్నారని ఆరోపించారు.

## కోనరావుపేటలో చిరుత పిల్లలు.. భయాందోళనలో ప్రజలు

రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా కోనరావుపేట మండలం శివంగలపల్లి శివారులో చిరుత పిల్లల సంచారం కలకలం రేపుతోంది. సబ్ స్టేషన్ ఎదుట ఉన్న డంపింగ్ యార్డ్ సమీపంలో చిరుతపులి రెండు పిల్లలకు జన్మనిచ్చినట్లు తెలిసింది. తెల్లవారుజామున చిరుత పిల్లను తీసుకువెళుతుండగా పొలం పనుల వద్దకు వెళుతున్న రైతు చూసి గ్రామస్తులకు సమాచారం అందించాడు.

దీంతో చిరుత రైతుల అలజడి విని ఓ పిల్లను వదిలేసి వెళ్ళింది. చిరుత పిల్లను చూసేందుకు మండలం నుంచి పెద్ద సంఖ్యలో జనం తరలివస్తున్నారు.

చిన్న చిరుతతో ప్రజలు సెల్ఫీలు దిగుతూ స్టేటస్ లు పెట్టుకుంటున్నారు. సమాచారం అందుకున్న సంబంధిత అటవీ అధికారులు సంఘటన స్థలానికి చేరుకుని చిరుత పిల్లను కరీంనగర్ కు తరలించారు.

చిరుత పిల్ల లభ్యం కావడంతో గ్రామీణ ప్రాంతాల్లో చిరుత సంచారం తో ప్రజల్లో భయాందోళనలు మరింత పెరిగాయి.

# నేరాల నియంత్రణ కోసం కార్డన్ సెర్చ్ - నిజామాబాద్ పోలీస్ కమిషనర్




నిజామాబాద్, సెప్టెంబర్ 22:ప్రజలతో సత్సంబందాల కోసం ఈ కమ్యూనిటి కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామనీ?. నేరాల నియంత్రణకు.. కమ్యూ నిటీ కాంటాక్ట్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పోలీస్ కమిషనర్ వి. సత్యనారాయణ అన్నారు. అపరిచిత వ్యక్తుల పట్ల ప్రజల అప్రమత్తంగా ఉండాలన్నారు. శుక్రవారం తెల్లవారు జామున నిజామా బాద్ జిల్లా కేంద్రంలోని 6టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ని రాంనగర్, నెహ్రూ నగర్, సారంగాపూర్ కాలనీలో పోలీ సులు కార్డన్ సెర్చ్ నిర్వహిం చారు.

ఈ సందర్భంగా టౌన్ 6 పి.యస్ పరిధిలో నేరాల నియంత్రణలో భాగంగా ముందు జాగ్రత్తగా దాదాపు 150 మంది పోలీస్ సిబ్బందితో ప్రతి వాహనాదారుల వాహ నాల డాక్యూమెంట్ల ను పరిశీలించారు. ఈ సందర్భంగాఎలాంటి కాగితాలు నంబర్ ప్లేట్ లేని మొత్తం 82ద్విచక్ర వాహనాలు, 31ఆటోలు, 2కార్లు, 2లారీలను స్వాదీనం చేసుకున్నారు. మట్కా నిర్వాహకులు అబ్దుల్ సాజీద్, సయ్యద్ షాదుల్లా లపై మట్కా కేసు నమోదు చేశారు. రెండు బెల్ట్ షాపులపై దాడి చేసి 248 లిక్కర్ బాటిల్స్ స్వాదీనం చేసుకొని పై కేసులు నమోదు చేశారు. ఒక మోరంతో ఉన్న లారీ నీ సీజ్ చేసి తహసీల్దార్ వారికి తదుపరి చర్యకోసం పంపారు.

.ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడు తూ ఇప్పటి వరకు టౌన్ 6 లోని ప్రజలతో సత్సంబందాల కోసం ఈ కమ్యూనిటి కాంటాక్ట్ ప్రోగ్రామ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. ప్రధానంగా వాహనా దారులు ట్రాఫిక్ నిబంధనలు తప్పకుండా పాటించాలని, హెల్మెట్ ధరించాలని,వాహనాల పత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని తెలిపారు. సైబర్ క్రైమ్ పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని, సైబర్ నేరాలు చేసే వారి ఉచ్చులో పడకూ డదని, ఎలాంటి పరిచయం లేని వారు ఆన్లైన్ ద్వారా మన సమాచారం అడిగినట్లయితే ఎవ్వరికి ఇవ్వరాదని అన్నారు. పిల్లలకు ఫోన్ లు ఇవ్వరా దని ,బ్యాంక్ నుండి మాట్లా డుతున్నామనీ మన బ్యాంక్ సమాచారం అడిగిన ఎవ్వరికి ఇవ్వరాదని, లక్కీడ్రా పేరుతో ఎవ్వరికి డబ్బు లు ఇవ్వరా దన్నారు. ఎవ్వరూ కూడా ఆన్లైన్ ట్రాడింగ్ మోసాలకు గురికావద్దని, ఎవ్వరయిన మోసానికి గురిఅవుతే వారు వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు సూచిం చారు. పరిచయం లేని వారికి ఇల్లు కిరాయి ఇవ్వవద్దని, కొత్త వ్యక్తులకు ఇంటిని కిరాయికి ఇచ్చేటప్పుడు వారి పూర్తి సమాచారం తెలుసుకోవాల న్నారు. ప్రతి ఒక్కరు వారి వారి పరిధిలో సి.సి కెమెరాలను ఏర్పాటు చేసుకోవడానికి ముం దుకురావాలని, ఈ సి.సి కెమెరాల ఏర్పాటుతో నేరగాళ్ల గుట్టురట్టులో ఎంతో దోహద పడుతున్నాయని, సి.సి కెమెరా ల వలన ఇప్పటి వరకు ఎన్నో దొంగతనాలకు పాలుపడిన నేరగాళ్లను కిడ్నాప్ కేసులో నిందితులను ఎంతో సులువు గావట్టుకోవడం జరిగిందన్నారు. ఎవ్వరయిన తప్పుడు పనులు చేస్తున్నట్లు సమాచారం తెలిసి న వారు ముందుగా సంబంధిత పోలీసులకు సమాచారం అందించాలన్నారు. శాంతి భద్ర తలకు ఎవరూ విఘాతము కలిగించరాదని అన్నారు. ఎవ్వరూ కూడా గంజాయి వాడ కం చేయకూడదని, గంజాయికి సంబందించిన సమాచారం తెలిసినట్లయితే వారు దగ్గర లోని పోలీస్ వారికి తెలియ జేయాలని అన్నారు. సైబర్ నేరాల నుండి ప్రజలు అనుని త్యం జాగ్రత్తగా ఉండాలని, లోన్ యాప్లు ఎవ్వరూ డౌన్లోడ్ చేసుకోరాదని, వాట్సప్ లేదా ఫేస్ బుక్ ద్వారా ఎవ్వరివైన ఫోటోలు ఉ పయోగించి ఆపదలో ఉన్నమని డబ్బులు తొందరగా పంపుమంటే పంప కూడదన్నారు. దానికోసం ఫోన్ చేసి పూర్తి విషయాలు కనుక్కో వాలని తెలిపారు. నేరచరిత్ర కలిగిన వారు తమ ప్రవర్తనను మార్చుకోవాలని, ప్రవర్తన మార్చుకోకుంటే తగు చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఈకార్యక్రమంలో డిప్యూటీ పోలీస్ కమిషనర్ ( ఎల్ అండ్ ఓ )ఎస్. జయరామ్, నిజామాబాద్ ఎ.సి.పి కిరణ్ కుమార్, సి.ఐలు 8, ఎస్.ఐ.లు 12 మంది, ఎ.ఎస్.ఐలు, హెడ్ కానిస్టేబుల్స్,కానిస్టేబుల్స్ , మహిళా పోలీస్ , మహిళా హోమ్ గార్డులు 130 మంది పోలీస్ సిబ్బంది, నేహ్రూ నగర్, రాంనగర్ సర్పంచులు అమానుల్లా, జిలానీ, ఎమ్.పి.టి.సి స్వామి కాలనీ వాసులు పాల్గొన్నారు

# ఎగ్జిబిషన్ సొసైటీ నూతన కార్యవర్గం ఎన్నిక



అబిడ్స్, సెప్టెంబర్ 21:ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి టి.హరీశ్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన ఎగ్జిబిషన్ సొసైటీ సర్వసభ్య సమావేశంలో నూతన కార్యవర్గాన్ని సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గత 82ఏండ్లుగా ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రతి సంవత్సరం అఖిల భారత పారిశ్రామిక ప్రదర్శన(నుమాయిష్)ను నిర్వహిస్తూ వస్తున్నారు. నుమాయిష్ నిర్వహణ ద్వారా వచ్చే ఆదాయంతో తెలంగాణ రాష్ట్ర వ్యా ప్తంగా 19 విద్యా సంస్థలను నెలకొల్పి విద్యా వ్యాప్తికి కృషి చేస్తున్నారు. ఆయా విద్యా సంస్థల ద్వారా ప్రతి ఏటా అనేక మంది విద్యార్థులు విద్యనభ్యసించడంతోపాటు ఇక్కడ విద్యనభ్యసించిన వారు దేశ, విదేశాల్లో ఉన్నత స్థానాల్లో స్థిరపడ్డారు. ఎగ్జిబిషన్ సొసైటీకి ప్రతి ఏడాది ఎన్నికలు నిర్వహించి నూతన కార్యవర్గా న్ని ఎన్నుకుంటారు. కార్యవర్గం నుమాయిష్ నిర్వహణకు కృషి చేస్తున్నది.

నూతన కార్యవర్గం

ఎగ్జిబిషన్ సొసైటీ అధ్యక్షుడిగా మంత్రి టి.హరీశ్‌రావు, ఉపాధ్యక్షుడిగా వనం సత్యేందర్, కార్యదర్శిగా బి.హనుమంతరావు, సంయుక్త కార్యదర్శిగా చంద్రజిత్‌సింగ్, కోశాధికారిగా ఏనుగుల రాజేందర్‌కుమార్, మేనేజింగ్ కమిటీ సభ్యులుగా అమర్‌జిత్‌రెడ్డి, ఆనంద్‌కుమార్ బొల్లా, అష్ఫక్ హైదర్, జీఆర్ అశోక్, మహ్మద్ ఫయీముద్దీన్, పి.శ్రీనివాస్, వినయ్‌కుమార్ ముదిరాజ్, డాక్టర్ ప్రభాశంకర్, బీఎన్ రాజేశ్వర్, ఉమారాణి ఎన్నికయ్యారు. నూతనంగా ఎన్నికైన ఈ పాలకవర్గం పదవీ కాలం ఏడాది పాటు కొనసాగుతుంది.

## ఆహ్వానం

**'అమ్మయాది' పెండెం ఫౌండేషన్**

(సాహిత్య, సామాజిక, విద్య, కళా సేవాసంస్థ )

**12వ వార్షికోత్సవం**

ప్రముఖ సాహితీవేత్త, అగ్రేసర వక్త

తెలంగాణ రచయితల సంఘం, రాష్ట్ర అధ్యక్షులు

**డా॥ నాళేశ్వరం శంకరం గారికి**

' **అమ్మయాది** ' జీవన సాఫల్య పురస్కారం

మరియు

కవులకు, ఉపాధ్యాయులకు

పురస్కార ప్రదానం

వేదిక: **రైతు వేదిక ప్రాంగణం, బ్రాహ్మణపల్లి**

మం॥ గుండాల, జి॥ యాదాద్రి భువనగిరి

తేది: 24-09-2023 (ఆదివారం), ఉదయం 10.30 గం॥లకు

ఆహ్వానించువారు

**పెండెం సత్యనారాయణ - లక్ష్మి దంపతులు**

వ్యవస్థాపకులు, ' **అమ్మయాది** ' పెండెం ఫౌండేషన్

బ్రాహ్మణపల్లి, మం॥ గుండాల

సెల్: 8247312054, 9704419008

మరియు

పెండెం రామచందర్, పెండెం పరంధాములు

పెండెం సుధర్మ, మశ్చేందర్ - స్వరూప

ఈ కార్యక్రమంలో...

సభాధ్యక్షులు : **శ్రీ పెండెం సత్యనారాయణ గారు**
అధ్యక్షులు, అమ్మయాది పెండెం ఫౌండేషన్

ముఖ్య అతిథి : **డా॥ నందిని సిధారెడ్డి గారు** ప్రముఖ సాహితీవేత్త
తెలంగాణ సాహిత్య అకాడమి తొలి అధ్యక్షులు

గౌరవ అతిథి : **డా॥ అందెశ్రీ గారు** లోకకవి
ప్రముఖ సాహితీవేత్త

ఆత్మీయ అతిథులు : **శ్రీ ఎం.డి. ఖలీల్ గారు**
జిల్లా పరిషత్ కో-ఆప్షన్ సభ్యులు, యాదాద్రి భువనగిరి
**శ్రీమతి బండారు సంధ్యా శ్రీనివాస్ గారు**
సర్పంచ్, బ్రాహ్మణపల్లి
**శ్రీమతి పాయిలి కవితా శ్రీనివాస్ గారు**
ఎం.పి.టి.సి. సభ్యులు, బ్రాహ్మణపల్లి - సుద్దాల

కార్యక్రమ సమన్వయం : **డా॥ పోరెడ్డి రంగయ్య గారు**
అధ్యక్షులు, తేజ సాహిత్య సేవా సంస్థ

పురస్కార గ్రహీతలు



జీవన సాఫల్య పురస్కార స్వీకర్త

**డా॥ నాళేశ్వరం శంకరం**

పాఠశాల నిర్వహణ - విద్యారంగం పురస్కార స్వీకర్త

**శ్రీ బండిరాజుల శంకర్ గారు**

వ్యవహర్త & ప్రధానాచార్య

శ్రీరామకృష్ణ విద్యాలయం, ఆలేరు

సాహిత్య పురస్కార స్వీకర్త

**శ్రీ పెసరు లింగారెడ్డి గారు**

కవి, రచయిత, వీరారెడ్డిపల్లి, తుర్కపల్లి మండలం

ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార స్వీకర్త

**శ్రీమతి పాశికంటి వెంకటరమణ గారు**

ఉపాధ్యాయురాలు, చేర్యాల, సిద్దిపేట జిల్లా

సాహిత్య, సామాజిక సేవా పురస్కార స్వీకర్త

**శ్రీ తౌర్ర ఉప్పలయ్య గారు**

ఉపాధ్యాయులు, ఆత్మకూరు (యం)

**జీవన సాఫల్య పురస్కార స్వీకర్త - 2022**



శ్రీరామోజు హరగోపాల్ గారు



డా॥ సుద్దాల అశోక్ తేజ గారు
2014



డా॥ కూరెళ్ళ విఠలాచార్య గారు
2015



డా॥ తిరునగరి గారు
2016



డా॥ లింగంపల్లి రామచంద్ర గారు
2017



ఆచార్య మసన చెన్నప్ప గారు
2018



శ్రీ బైస దేవదాసు గారు
2019

# బ్యాంకాక్‌లోని ఖ్లాంగ్ టోయి పోర్ట్‌లో థాయ్ అధికారులతో కలిసి పొల్యూషన్ రెస్పాన్స్ టేబుల్ టాప్ వ్యాయామం నిర్వహించిన ఐసిజి కాలుష్య నియంత్రణ నౌక "సముద్ర ప్రహరీ"

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:భాగస్వామ్య సవాళ్లను, ముఖ్యంగా సముద్ర కాలుష్యాన్ని పరిష్కరించడంలో భారతదేశం యొక్క సముద్ర నైపుణ్యం మరియు నిబద్ధతను హైలైట్ చేస్తూ ఇండియన్ కోస్ట్ గార్డ్ (ఐసిజి) కాలుష్య-నియంత్రణ నౌక 'సముద్ర ప్రహరీ' సమగ్ర కాలుష్య ప్రతిస్పందన పట్టిక టాప్ వ్యాయామం మరియు ప్రదర్శనను బ్యాంకాక్‌లోని ఖ్లాంగ్ టోయి పోర్ట్‌లో నిర్వహించింది. సెప్టెంబర్ 20, 2023న తన నాలుగు రోజుల పర్యటనలో ఈ కార్యక్రమం చివరిది. ఈ కసరత్తులో థాయిలాండ్ మారిటైమ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ కోఆర్డినేషన్ సెంటర్ (ఎంఈసిసి), కస్టమ్స్ డిపార్ట్‌మెంట్, మెరైన్ డిపార్ట్‌మెంట్, రాయల్ నేవీ, ఫిషరీస్ డిపార్ట్‌మెంట్ మరియు ఇతర ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

ఈ వ్యాయామం ఐసిజి సహకారంతో థాయిలాండ్ సముద్ర కాలుష్య ప్రతిస్పందన ఆకస్మిక ప్రణాళికను రూపొందించిన మరియు పరీక్షించే ఉద్దేశంతో చేపట్టారు. ఇది పరిజ్ఞానాన్ని పంచుకోవడం మరియు సేవల మధ్య పరస్పర వాతావరణాన్ని పెంపొందించింది. చమురు కాలుష్యానికి సంబంధించిన అంశాల్లో అవాంతరాలు లేని సహకారాన్ని ఇది అందిస్తుంది. ఈ వ్యాయామం ఐసిజి కాలుష్య ప్రతిస్పందన సామర్థ్యాలను మరియు ఈ ప్రాంతం పట్ల భారతదేశ భాగస్వామ్య నిబద్ధతను ప్రదర్శించింది.

వ్యాయామానికి ముందు దౌత్య కార్యాలయ అధికారులు మరియు థాయ్-ఎంఈసిసి ప్రతినిధులతో ఓడ డెక్‌పై ఉమ్మడి యోగా సెషన్ నిర్వహించబడింది. యోగాను తమ దైనందిన జీవితంలో చేర్చడం యొక్క ప్రాముఖ్యత గురించి, దాని ఏకీకృత శక్తిని మరియు అనేక ప్రయోజనాలను ప్రతినిధులు తెలిపారు.

సందర్శన సమయంలో నౌక సిబ్బంది, నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సిసి) క్యాడెట్‌లు మరియు భారత రాయబార కార్యాలయం ప్రతినిధులు పట్టాయా బీచ్‌లో అంతర్జాతీయ కోస్టల్ బీచ్ క్లీన్-అప్ కార్యక్రమంలో చురుకుగా పాల్గొన్నారు. ఈ చొరవ పునీత్ సాగర్ అభియాన్‌లో భాగంగా పరిశుభ్రత యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహన పెంచుతూనే ప్లాస్టిక్ మరియు ఇతర వ్యర్థ పదార్థాల సముద్ర తీరాలను శుభ్రం చేయడానికి ఎన్‌సిసి దేశవ్యాప్త ఫ్లాగ్‌షిప్ ప్రచారం. ఈ కార్యాచరణ పర్యావరణ బాధ్యతను ప్రోత్సహించడంలో స్థానిక థాయ్ యువజన సంస్థలు సహకారం అందించాయి.

థాయ్ ఎంఈసిసి ప్రధాన కార్యాలయంలో డైరెక్టర్ జనరల్ ఆఫ్ పాలసీ అండ్ ప్లాన్స్ రియర్ అడ్మిరల్ విచ్చు తుపా-ఆంగ్‌తో కమాండింగ్ ఆఫీసర్ డిఐజి జీడి రాటూరి సమావేశం నిర్వహించారు. సముద్ర భద్రత విషయంలో భారత్ మరియు థాయ్‌లాండ్ మధ్య పెరుగుతున్న సంబంధాలపై ఇరువురు నేతలు చర్చించారు.

భారతదేశం-ఆసియాన్ చొరవ కింద బ్యాంకాక్‌లో 'సముద్ర ప్రహరీ' సందర్శన ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనికత అయిన సాగర్ (ప్రాంతంలోని అందరికీ భద్రత ఉ వృద్ధి) మరియు భారతదేశ జీ20 ప్రెసిడెన్సీ థీమ్ 'వసుధైవ కుటుంబం - ఒక భూమి, ఒక కుటుంబం, ఒక భవిష్యత్తు'కు అనుగుణంగా సముద్ర రంగంలో ఐసిజి మరియు థాయ్ ఎంఈసీసీ మధ్య సంబంధాలను పెంపొందించడంలో మరియు భారతదేశాన్ని నమ్మదగిన సముద్ర భాగస్వామిగా హైలైట్ చేయడంలో ఒక ముఖ్యమైన మైలురాయిని సూచిస్తుంది. నవంబర్ 2022లో కంబోడియాలో జరిగిన ఆసియాన్ డిఫెన్స్ మినిస్టర్స్ ప్లస్ మీటింగ్ సందర్భంగా రక్షణ మంత్రి శ్రీ రాజ్‌నాథ్ సింగ్ భారత్-ఆసియాన్ ఇనిషియేటివ్ ఆఫ్ ఓవర్సీస్ డిప్లాయ్‌మెంట్‌ను ప్రకటించారు.

# జాతీయ రహదారుల మౌలికసదుపాయాల ట్రస్టో అదనపు యూనిట్లను 245291 ఒంటారియో లిమిటెడ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:జాతీయ రహదారుల మౌలికసదుపాయాల ట్రస్టో అదనపు యూనిట్లను 245291 ఒంటారియో లిమిటెడ్, హైవే కన్సెషన్స్ వన్ ప్రైవేట్ లిమిటెడ్లో ఈక్విటీ వాటను 2743298 ఒంటారియో లిమిటెడ్ ప్రతిపాదిత సేకరణకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సిసిఐ) ఆమోదం తెలిపింది.

2452991 ఒంటారియో లిమిటెడ్ (ఒటిపిపి 1), 2743298 ఒంటారియో లిమిటెడ్ (ఒటిపిపి 2) లు పూర్తిగా ఒంటారియో టీచర్స్ పెన్షన్ ప్లాన్ బోర్డ్ (ఒటిపిపిబి) నియంత్రణలో ఉంది.

ఒటిపిపిబి పెన్షన్ ప్రయోజనాలను, ఇన్వెస్ట్మెంట్ పెన్షన్ ప్లాన్ నిధులను నిర్వహిస్తుంది. ఇది కెనడియన్ ప్రావిన్స్ లోని ఒంటారియోలో ప్రస్తుతం పనిచేస్తున్న , పదవీ విరమణ చేసిన టీచర్లకు సంబంధించి నిధులను ప్రపంచవ్యాప్తంగా నిర్వహిస్తుంది.

హైవేస్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ట్రస్ట్ (టార్గెట్ ట్రస్ట్) అనేది మౌలికసదుపాయాల పెట్టుబడి ట్రస్ట్. ఇది సెక్యూరిటీస్ ఎక్స్ఛేంజ్ బోర్డ్ ఆఫ్ ఇండియా వద్ద రిజిస్టర్ అయింది. సెబి ఇన్ ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్మెంట్ ట్రస్ట్ రెగ్యులేషన్స్ 2014 (ఇన్ విట్ రెగ్యులేషన్స్) కింద రిజిస్టర్ చేశారు. టార్గెట్ ట్రస్ట్ ప్రస్తుతం ఆరు రోడ్ అసెట్స్ను ఇండియాలో కలిగి ఉంది. ఇది రోడ్లు, జాతీయ రహదారులను ఇండియాలో నిర్వహిస్తుంది.

హైవే కన్సెషన్స్ వన్ ప్రైవేట్ లిమిటెడ్ (హెచ్.సి వన్) అనేది ఇండియాలో ఏర్పడిన ఇన్ కార్పొరేటెడ్ కంపెనీ. దీని ఉద్దేశం ఇండియాలో రోడ్ అసెట్స్ను నిర్వహించడం..

హైవే కన్సెషన్స్ టార్గెట్ ట్రస్ట్ కింద ఏర్పడిన ఇన్వెస్ట్మెంట్ మేనేజర్.ఇన్విట్ రెగ్యులేషన్ల కింద పనిచేస్తుంది. ఇది ఇన్విట్ రెగ్యులేషన్ల కింద గల రెగ్యులేషన్ 10 ప్రకారం కార్యకలాపాలను నిర్వహిస్తుంది.

పెట్టుబడి నిర్ణయాలు తీసుకోవడం, టార్గెట్ ట్రస్ట్ ప్రాజెక్టులు ఇతర పెట్టుబడి నిధులకు సంబంధించి నిర్ణయాలు తీసుకుంటుంది.

ప్రతిపాదిత కాంబినేషన్ టార్గెట్ ట్రస్టోని అదనపు యూనిట్లను ఒటిపిపి 1 సమకూర్చుకోవడం, అలాగే హెచ్.సి సంస్థ లో ఒటిపిపి 2 సంస్థ వేరుగా ఈక్విటీ వాటాలను సమీకరించుకోవడానికి సంబంధించినది.

# వంతెనలు, ఇతర నిర్మాణాల ఆకృతులు & నిర్మాణాన్ని బలోపేతం చేయడానికి డీఎంఆర్‌సీతో ఎన్‌హెచ్‌ఏఐ ఒప్పందం




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:ప్రపంచ స్థాయి జాతీయ రహదారులను నిర్మించే ప్రయత్నాల్లో భాగంగా, వివిధ వంతెనలు/ నిర్మాణాల ఆకృతులు, ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టుల భద్రత అంశాలు, ఎన్‌హెచ్‌ఏఐ అధికార్ల సామర్థ్యాన్ని పెంచడానికి దిల్లీ మెట్రో రైల్ కార్పొరేషన్‌తో (డీఎంఆర్‌సీ) ఎన్‌హెచ్‌ఏఐ ఈ రోజు ఒక అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఎన్‌హెచ్‌ఏఐ ఛైర్మన్ శ్రీ సంతోష్ కుమార్ యాదవ్, డీఎంఆర్‌సీ మేనేజింగ్ డైరెక్టర్ డా.వికాస్ కుమార్ సమక్షంలో ఎంవోయూపై సంతకాలు జరిగాయి. రెండు సంస్థల సీనియర్ అధికార్లు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

దేశవ్యాప్తంగా జాతీయ రహదారులపై వంతెనలు, నిర్మాణాలు, సొరంగాలు, ఆర్ఈ గోడలకు సంబంధించిన ప్రణాళిక, రూపకల్పన, నిర్మాణం, నిర్వహణను సమీక్షించే ఎన్‌హెచ్‌ఏఐ 'డిజైన్ డివిజన్'ను ఈ ఒప్పందం బలోపేతం చేస్తుంది.

ఒప్పందం ప్రకారం, ప్రస్తుతం కొనసాగుతున్న ఎన్‌హెచ్‌ఏఐ ప్రాజెక్టుల్లోని అన్ని వంతెనలు/ నిర్మాణాల ఆకృతుల సమీక్షించడంలో డీఎంఆర్‌సీ సేవలను అందిస్తుంది. ఎంపిక చేసిన వంతెనలు, నిర్మాణాలు, సొరంగాలు, ఆర్ఈ గోడలు, ఇతర ప్రత్యేక నిర్మాణాల ఆకృతులపైనా సమీక్ష ఉంటుంది. స్వతంత్ర్య వంతెనలు, ప్రత్యేక నిర్మాణాలను సమీక్షించేందుకు వివరణాత్మక ప్రాజెక్టు నివేదిక (డీపీఆర్) దశలో ఎన్‌హెచ్‌ఏఐకి డీఎంఆర్‌సీ సాయం చేస్తుంది.

ఎంపిక చేసిన వంతెనలు, ప్రత్యేక నిర్మాణాల కట్టుబడి పద్ధతులు, తాత్కాలిక నిర్మాణాలు, ఆవిష్కరణ పద్ధతులను సమీక్షించడంలోనూ డీఎంఆర్‌సీ సాయం చేస్తుంది. దీంతోపాటు, ఎన్‌హెచ్‌ఏఐ అధికారుల సామర్థ్యం పెంచడానికి ప్రత్యేక శిక్షణ కార్యక్రమాలను డీఎంఆర్‌సీ నిర్వహిస్తుంది.

ఈ ఒప్పందం రెండేళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఉత్తమ విధానాలను పంచుకోవడం, దేశ నిర్మాణ లక్ష్యంలో దోహదపడే రవాణా అవస్థాపన నెట్‌వర్క్‌ను మెరుగుపరిచేందుకు కలిసి పనిచేయడం వంటి అంశాల్లో రెండు ప్రభుత్వ సంస్థల మధ్య సహకారాన్ని ఈ చొరవ ప్రతిబింబిస్తుంది.

# గౌడ కులస్తులకు సేఫ్టీ మోకులను అందించాలి... అనపురం రవి



మహబూబాబాద్, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): పెద్దవంగర మండల కేంద్రం నుండి పెద్దవంగర కల్లుగీత కార్మిక సంఘం మండల అధ్యక్షులు అనపురం రవి ఆధ్వర్యంలో కల్లుగీత కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఈరోజు హైదరాబాద్ ఇందిరా పార్క్ వద్ద జరిగే బహిరంగ సభకు భారీ ఎత్తున గౌడ కులస్తులు బయలుదేరారు. ఈ సందర్భంగా అనపురం రవి మాట్లాడుతూ గౌడ సోదరులు తాళ్లు ఎక్కే క్రమంలో ప్రమాదం జరిగి వందలాదిమంది చనిపోవడం, కాళ్లు, చేతులు విరగడం జరుగుతుంది ,వాటి నివారణ కొరకై వారికి సేఫ్టీ మోకులను ఇవ్వాలని , గౌడ సోదరులకు ద్విచక్ర వాహనాలను అందించాలని ,అదేవిధంగా గౌడ బంధు ప్రకటించి గౌడలకి ప్రత్యేక బడ్జెట్ కేటాయించాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. ఈ కార్యక్రమంలో మద్దెల గురువయ్య,కొయ్యేడి యాకయ్య వెంకన్న, మొగలగాని హరీష్ ,అంజయ్య,వెంకట సోములు ,బండారి నారాయణ ,శేషగిరి, రాచకొండ వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# జులై నెలలో ఈఎస్ఐ పథకం కింద పేర్లు నమోదు చేసుకున్న 19.88 లక్షల మంది కొత్త ఉద్యోగులు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:2023 జులై నెలలో 19.88 లక్షల మంది కొత్త ఉద్యోగులు పేర్లు నమోదు చేసుకున్నారని ఈఎస్ఐసీ తాత్కాలిక ఉద్యోగ గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

2023 జులై నెలలో దాదాపు 27,870 కొత్త సంస్థలు నమోదయ్యాయి, 'ఉద్యోగుల రాష్ట్ర బీమా సంస్థ' సామాజిక భద్రత గొడుగు కిందకు వచ్చాయి.

దేశంలోని యువత కోసం భారీగా ఉద్యోగ కల్పన జరిగినట్లు గణాంకాలు వెల్లడిస్తున్నాయి.

జులై నెలలో నమోదైన మొత్తం 19.88 లక్షల మంది ఉద్యోగుల్లో, 25 సంవత్సరాల వయస్సు గల యువ ఉద్యోగులు 9.40 లక్షల మంది ఉన్నారు. మొత్తం ఉద్యోగుల్లో ఇది 47.9%.

2023 జులైలో మహిళా ఉద్యోగుల నికర నమోదులు 3.82 లక్షలు. అదే నెలలో 52 మంది లింగమార్పిడి ఉద్యోగులు కూడా ఈఎస్ఐ పథకం కింద పేరు నమోదు చేసుకున్నారు. సమాజంలోని ప్రతి వర్గానికి ప్రయోజనాలు అందించడానికి ఈఎస్ఐసీ కట్టుబడి ఉంది.

ఈ సమాచారం నిరంతరం మారుతుంది కాబట్టి ఉద్యోగ గణాంకాలను తాత్కాలిక సమాచారంగా చూడాలి.

# అంగన్వాడీల సేవలను గుర్తించని ప్రభుత్వం.. నేడు కేటీఆర్ కార్యాలయం ముట్టడి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22: (నేటినిజం ప్రతినిధి): ప్రభుత్వ కార్యక్రమాలు విజయవంతం చేయడానికి అంగన్వాడీ టీచర్లు, ఆయాలు నిరంతరం సేవలందిస్తున్నప్పటికీ వారి సేవలను ప్రభుత్వం గుర్తించడం లేదని, వీరి డిమాండ్లు పరిష్కరించకపోవడం శోచనీయమని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు ఆందోళన వ్యక్తం చేశారు. శుక్రవారం రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో నిర్వహిస్తున్న నిరవధిక సమ్మె 12వ రోజుకు చేరుకుంది. ఈ సమ్మెలో భాగంగా రెండు రోజులు రిలే నిరాహార దీక్షల కార్యక్రమం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో చేపట్టారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కడారి రాములు మాట్లాడుతూ? 12 రోజులుగా సమ్మె చేస్తూ నిరసనలు కొనసాగిస్తున్నప్పటికీ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నాయని ఆరోపించారు. గ్రామ గ్రామాన ఓటర్ల జాబితాతో పాటు ప్రతి ప్రభుత్వ కార్యక్రమానికి అంగన్వాడీ ఉద్యోగులు సర్వే చేసి ప్రభుత్వ పథకాలు విజయవంతం కావడానికి దోహద పడుతున్నారన్నారు. అయినప్పటికీ సమ్మె పరిష్కరించడంలో ప్రభుత్వం మొండివైఖరి అవలంబిస్తున్నదన్నారు. సామాన్యులు చనిపోతే వారికి ఇన్సూరెన్స్ లు ఉన్నాయని, కానీ అంగన్వాడీ ఉద్యోగులు విధుల్లో చనిపోతే ఎలాంటి బీమా సౌకర్యం లేదన్నారు. ఇక్కడి నుండి ప్రాతినిధ్యం వహిస్తున్న మంత్రి, స్థానిక శాసనసభ్యుల నుండి ఎలాంటి స్పందన రావడంలేదని, దీనికి నిరసనగా రేపు మంత్రి కేటీఆర్ క్యాంపు కార్యాలయాన్ని ముట్టడిస్తామన్నారు. తాము రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్, సమాన పనికి సమాన వేతనం మొదలైన సాధారణ కోరికలు కోరుతున్నామన్నారు. వీటిని పరిష్కరించని పక్షంలో సమ్మె మరింత ఉధృతం చేస్తామని కడారి రాములు హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో తెలంగాణ అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ జిల్లా అధ్యక్షురాలు కల్లూరు చందన, ప్రధాన కార్యదర్శి ఎదురుగట్ల మమత, జిల్లా ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు, జిల్లా అధ్యక్షుడు అజ్జె వేణు, అంగన్వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ట్రెజరీ కొండి కొప్పుల పద్మ, ఉపాధ్యక్షురాలు ఓరగంటి శ్యామల, పద్మ, చొప్పరి అంజలి, వాణి, మంగ, రమా, ఉమా, సునీత, జ్యోతి, లక్ష్మి, ఆయేషా, సుజాత, వజ్ర, వీణు బాయి, సైదా షఫీ, అంగన్వాడీ టీచర్లు, ఆయాలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# డీహెచ్ పరిధిలో ఫార్మాసిస్టు పోస్టులకు కౌన్సిలింగ్ షురూ..

హైదరాబాద్, సెప్టెంబర్ 22:ఫార్మాసిస్టు పోస్టులకు వైద్యారోగ్య శాఖలో కౌన్సెలింగ్ ప్రక్రియ ప్రారంభమైంది. గురువారం డైరెక్టర్ ఆఫ్ పబ్లిక్ హెల్త్ పరిధిలో 105 పోస్టులకు అధికారులు కౌన్సెలింగ్ నిర్వహించారు. 310 ఫార్మిసిస్టు పోస్టుల భర్తీకి గాని ఈ కౌన్సెలింగ్ ప్రక్రియ కొనసాగుతోంది. టీవీవీపీ పరిధిలోని 135 పోస్టులకు, డీఎంఈ పరిధిలోని 70 పోస్టులకు శుక్రవారం కౌన్సెలింగ్ జరుగనుంది.

వీరికి త్వరలో ఆర్థిక, వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు చేతులవిాదుగా నియామక పత్రాలు అందజేయనున్నారు. రాష్ట్ర ప్రభుత్వం 369 ఫార్మాసిస్ట్ పోస్టుల భర్తీకి 2018 జనవరి 25న టీఎస్పీఎస్సీ ద్వారా నోటిఫికేషన్ జారీ చేసింది. ఇందులో డీపీహెచ్ పరిధిలో 125, డీఎంఈ 96, టీవీవీపీలో 148 పోస్టులు ఉన్నాయి. అయితే, కోర్టు కేసుల కారణంగా ఫలితాల వెల్లడిలో జాప్యం చోటుచేసుకుంది.

ఇందులో 310 పోస్టుల భర్తీకి న్యాయస్థానం తాజాగా అనుమతి ఇచ్చిన నేపథ్యంలో టీఎస్పీఎస్సీ ఈ నెల 12న 310 పోస్టులకు ఎంపికైన అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఇందులో డీపీహెచ్ పరిధిలో 105, డీఎంఈ పరిధిలో 70, టీవీవీపీ పరిధిలో 135 పోస్టులు ఉన్నాయి. వీరికి కౌన్సెలింగ్ నిర్వహించి కోరుకున్న చోట పోస్టింగ్ ఇవ్వనున్నారు. ఫార్మాసిస్టులుగా నియమితులవుతున్న వారికి మంత్రి హరీష్ రావు శుభాకాంక్షలు తెలిపారు.

# కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి మంత్రి గంగుల భూమిపూజ



కరీంనగర్,సెప్టెంబర్ 22:కరీంనగర్ బై పాస్ లో గలరేణుక ఎల్లమ్మ దేవి ఆలయం కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి భూమి పూజ చేశారు బీసీ సంక్షేమ పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్. ఈ కార్యక్రమంలోనగర మేయర్ యాదగిరి సునీల్ రావు, గ్రంధాలయ చైర్మన్ పొన్నం అనిల్,కార్పొరేటర్లు జంగిల్ ఐలేందర్ యాదవ్, భూమా గౌడ్, గుగ్గిళ్ల జయశ్రీ–శ్రీనివాస్,నగర బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు చల్ల హరి శంకర్ మరియు గౌడ సంఘం నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. గణపతి మండపాల విద్యుత్ చార్జీ లను అందించిన మంత్రి గంగులగణేష్ నవరాత్రి వేడుకల సందర్బంగా మండపాలకు ఉపయోగించే విద్యుత్ చార్జీలను రాష్ట్ర బి సి సంక్షేమ పౌర సరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ చెల్లించారు. శుక్రవారం టి ఎస్ ఎన్ పి డి సి ఎల్ కరీంనగర్ ఎస్ ఈ కి 4 లక్షల రూపాయలచెక్కును అందించారు. గణేష్ నవరాత్రి వేడుకలను, నిమజ్జన కార్యక్రమాన్ని సోదర భావంతో శాంతియుతంగా జరుపు కోవాలని మండపాల నిర్వాహకులకు మంత్రి సూచించారు. కార్యక్రమంలో జెడ్ పి చైర్పర్సన్ కనుమల్ల విజయ, నగర మేయర్ సునీల్ రావు, కొత్తపల్లి చైర్మన్ రుద్ర రాజు, బి ఆర్ ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ పాల్గొన్నారు.

# పొత్తుపై కాంగ్రెస్ పార్టీయే ఆలోచించి నిర్ణయం తీసుకోవాలి : సీపీఐ నేత నారాయణ

హైదరాబాద్, సెప్టెంబర్ 22: తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల్లో కమ్యూనిస్టులతో పొత్తులపై కాంగ్రెస్ పార్టీయే ఆలోచించి తగిన నిర్ణయం తీసుకోవాలని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. శుక్రవారం ఢిల్లీలోని ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ఉమ్మడి భవన్లో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన.. పొత్తులపై స్పందిస్తూ.. జాతీయస్థాయిలో విపక్ష 'ఇండి' కూటమిలో సీపీఐ ఉందని గుర్తుచేశారు. ఈ కూటమి ధర్మాన్ని తెలంగాణలో కూడా అమలు చేయాలని మేం కోరుతున్నామని చెప్పారు.

# 'పరిశుభ్రత' ఖర్చులను పెంచదు, కానీ ఉత్పాదకతను పెంచుతుంది మరియు వనరులను సంరక్షిస్తుంది-డాక్టర్ జితేంద్ర సింగ్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:'స్వచ్ఛత' అంటే పరిసర పరిశుభ్రత, అది ఖర్చులను పెంచదు, వాస్తవానికి ఉత్పాదకతను పెంచుతుంది మరియు వనరులను సంరక్షిస్తుంది అని స్వచ్ఛత ప్రత్యేక ప్రచారం 3.0 కోసం సన్నాహాలను పర్యవేక్షించడానికి నార్త్ బ్లాక్లోని ఆర్థిక మంత్రిత్వ శాఖ కార్యాలయాలను సందర్శించినప్పుడు కేంద్ర సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత) సైన్స్ & టెక్నాలజీ, ఎం ఓ ఎస్ పి ఎం ఓ, పర్సనల్, పబ్లిక్ గ్రీవెన్స్, పెన్షన్స్,అటామిక్ ఎనర్జీ అండ్ స్పేస్ డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. సంతృప్త విధానంతో ప్రభుత్వ కార్యాలయాల్లో పెండింగ్ను తగ్గించాలని సీనియర్ అధికారులను ఆదేశించారు.

గత రెండు స్వచ్ఛతా ప్రచారాల్లో దాదాపు 90 లక్షల చదరపు అడుగుల విలువైన కార్యాలయ స్థలాన్ని ఖాళీ చేసి ఉత్పాదక వినియోగంలోకి తెచ్చామని కేంద్ర మంత్రి తెలిపారు. అంతేకాకుండా ప్రభుత్వానికి చెత్త తొలగింపు ద్వారా రూ. 370.83 కోట్లు ఆర్జించింది, అలాగే 64.92 లక్షల ఫైళ్లను సమీక్షించారు, 4.56 లక్షల ప్రజా ఫిర్యాదులను పరిష్కరించారు మరియు 8,998 మంది ఎంపీల రిఫరెన్స్లకు సమాధానం ఇచ్చారు. స్వచ్ఛతా ప్రచారం ప్రభుత్వంలో ఈఆఫీస్ పని సంస్కృతిని కూడా మెరుగుపరిచి తద్వారా ఇప్పుడు 90% పైగా ఫైల్ వర్క్ ఆన్లైన్ చేయబడింది.

భారత ప్రభుత్వం అక్టోబర్ 2, 2023 నుండి 31 అక్టోబర్, 2023 వరకు జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ప్రత్యేక ప్రచార 3.0ని ప్రకటించింది. ఈ ప్రచారం గత రెండేళ్లలో నిర్వహించిన ప్రత్యేక ప్రచారాల కొనసాగింపు.

ప్రత్యేక ప్రచారం 3.0 పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం ప్రత్యేక ప్రచారం 3.0 అమలు కోసం నోడల్ విభాగం మంత్రిత్వ శాఖలు/డిపార్ట్మెంట్లు మరియు వాటి అనుబంధ/సబార్డినేట్ కార్యాలయాలకు అదనంగా సేవలకు బాధ్యత వహించే ఫీల్డ్/అవుట్స్టేషన్ కార్యాలయాలపై లేదా పౌర సంబంధాలపై దృష్టి పెడుతుంది.

ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ స్వచ్ఛతా ప్రచారాన్ని కొద్ది నెలల్లోనే జన ఆందోళనగా మార్చారని డాక్టర్ జితేంద్ర సింగ్ అన్నారు. డీ ఏ ఆర్ పీ జీ 300 ఉత్తమ అభ్యాసాల సంకలనాన్ని ఆవిష్కరించింది. ఇది అన్ని ప్రభుత్వ మంత్రిత్వ శాఖలు మరియు విభాగాలచే అమలు చేయబడుతుంది మరియు మీడియా ద్వారా విస్తృతంగా ప్రచురించబడుతుంది, 'పూర్తి ప్రభుత్వం' మరియు 'సంపూర్ణశాస్త్రీయత' విధానాన్ని హైలైట్ చేస్తుంది.

పర్యటన సందర్భంగా, డాక్టర్ జితేంద్ర సింగ్కు ప్రత్యేక ప్రచారం 2.0 సందర్భంగా చేపట్టిన కార్యక్రమాల కోల్లెజ్ను సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఇన్డైరెక్ట్ టాక్సెస్ & కస్టమ్స్ (సి బీ ఐ సి) చైర్మన్ శ్రీ సంజయ్ అగర్వాల్ అందించారు చేపట్టిన కార్యక్రమాల వివరించారు. సి బీ ఐ సి కార్యాలయ స్థలాన్ని సరైన ఉపయోగం కోసం రీడిజైన్ చేసినది మరియు సీ జీ ఎస్ టి, భోపాల్ జోన్ ద్వారా దాని కార్యాలయాల వద్ద మిద్దె తోటను మరియు ఫలహారశాలను రూపొందించామని ఆయన మంత్రికి వివరించారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ కార్యదర్శి శ్రీ సంజయ్ మల్హోత్రా మరియు డీ ఏ ఆర్ పీ జీ కార్యదర్శి శ్రీ వి.శ్రీనివాస్ కూడా పాల్గొన్నారు.

ప్రత్యేక ప్రచారం 3.0 మంత్రిత్వ శాఖలు/డిపార్ట్మెంట్లు మరియు వాటి అనుబంధ/సబార్డినేట్ కార్యాలయాలకు అదనంగా సేవలకు బాధ్యత వహించే ఫీల్డ్/అవుట్స్టేషన్ కార్యాలయాలపై మరియు పౌర సంబంధాలపై దృష్టి పెడుతుంది. పరిపాలనా సంస్కరణలు మరియు ప్రజా ఫిర్యాదుల విభాగం (డీ ఏ ఆర్ పీ జీ ) ప్రత్యేక ప్రచారం 3.0 అమలుకు నోడల్ విభాగం.

క్యాబినెట్ సెక్రటరీ 25 ఆగస్టు, 2023న భారత ప్రభుత్వ కార్యదర్శులందరినీ ఉద్దేశించి ప్రసంగించారు మరియు దీనికి సంబంధించిన డీ ఏ ఆర్ పీ జీ మార్గదర్శకాలు 1 సెప్టెంబర్, 2023న జారీ చేయబడ్డాయి.

# ఎన్డీయేలో చేరిన జేడీఎస్



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22: కర్ణాటక రాజకీయాల్లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఎన్డీయే కూటమిలో జేడీఎస్ పార్టీ చేరింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాలతో ఈరోజు ఢిల్లీలో కర్ణాటక మాజీ ముఖ్యమంత్రి, జేడీఎస్ అగ్రనేత కుమారస్వామి భేటీ అయ్యారు. వీరి సమావేశం ముగియగానే ఎన్డీయేలో చేరినట్టు కుమారస్వామి ప్రకటించారు. ఈ కీలక భేటీ సమయంలో గోవా ముఖ్యమంత్రి ప్రమోద్ సావంత్ కూడా అక్కడే ఉన్నారు. ఈ తాజా పరిణామం తో కర్ణాటకలో భాజపా, జేడీఎస్ మధ్య పొత్తు పొడుపులపై గత కొన్నాళ్లుగా వస్తోన్న ఊహాగానాలకు తెరపడిన ట్లయింది.అయితే, కర్ణాటకలో ఈ రెండు పార్టీల మధ్య సీట్ల కేటాయిం పులకు సంబంధించిన వివరాలు మాత్రం ఇంకా వెల్లడికాలేదు. ఈ అంశంపై భాజపా జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా ట్వీట్ చేశారు. అమిత్ షా సమక్షంలో కర్ణాటక మాజీ సీఎం, జేడీఎస్ నేత హెచ్డీ కుమారస్వామి సమావేశమయ్యార న్నారు. జేడీఎస్ ఎన్డీయేలో భాగస్వామి కావాలని నిర్ణయం తీసు కోవడం సంతోషంగా ఉందన్నారు. జేడీఎస్ను హృదయ పూర్వకంగా తమ కూటమిలోకి ఆహ్వా నిస్తున్నట్లు పేర్కొన్నారు.

# లోక్ సభలో నారీ శక్తి వందన్ అధినియంపై చర్చలో పాల్గొన్న కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:కేంద్ర హోం , సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా ఈ రోజు లోక్ సభలో నారీ శక్తి వందన్ అధినియం పై చర్చలో పాల్గొన్నారు. శ్రీ అమిత్ షా మాట్లాడుతూ, 2023 సెప్టెంబర్ 19 భారత పార్లమెంటు చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడుతుందని, ఎందుకంటే ఈ రోజున వినాయక చవితి సందర్భంగా కొత్త పార్లమెంటు పనిచేయడం ప్రారంభించిందని, మహిళలకు చట్ట సభలలో రిజర్వేషన్ హక్కును కల్పించే దీర్ఘకాల పెండింగ్ బిల్లును సభలో ప్రవేశపెట్టారని అన్నారు. 140 కోట్ల జనాభాలో 50 శాతం ఉన్న మహిళా శక్తిని నిజంగా గౌరవించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడంతో లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయని అమిత్ షా తెలిపారు.

140 కోట్ల జనాభాలో 50 శాతం ఉన్న మహిళా శక్తిని నిజంగా గౌరవించినందుకు ప్రధాని నరేంద్ర మోదీకి హృదయపూర్వక ధన్యవాదాలు తెలుపుతున్నానని ఆయన అన్నారు. ఈ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందడంతో లోక్ సభ, రాష్ట్రాల అసెంబ్లీల్లో మూడింట ఒక వంతు సీట్లు మహిళలకు రిజర్వు అవుతాయని అమిత్ షా తెలిపారు. ఈ బిల్లు ఆమోదంతో మహిళలు తమ హక్కుల కోసం చేస్తున్న సుదీర్ఘ పోరాటానికి తెరపడనుంది. ఇటీవల జరిగిన జి-20 సదస్సులో ప్రధాని శ్రీ మోదీ "మహిళల నేతృత్వంలో అభివృద్ధి" అనే భావనను ప్రపంచం ముందు ఉంచారని, ఈ బిల్లు ఆమోదంతో, కొత్త శకం ప్రారంభమవుతుందని, ఎందుకంటే ఇప్పుడు ఈ దేశంలోని మహిళలు విధానాలలో భాగస్వాములు కావడమే కాకుండా విధానాలను నిర్ణయించడంలో కూడా కీలక పాత్ర పోషిస్తారని ఆయన అన్నారు.

మహిళా సాధికారత అనేది కొన్ని పార్టీలకు రాజకీయ ఎజెండా కావచ్చునని, కానీ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వానికి మహిళా సాధికారత గుర్తింపునకు సంబంధించిన అంశమని శ్రీ అమిత్ షా అన్నారు.

2014లో 30 ఏళ్ల తర్వాత ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ ప్రజలు పూర్తి మెజారిటీతో ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారన్నారని, ప్రధాని మోదీ నాయకత్వంలో మహిళల భద్రత, గౌరవం, భాగస్వామ్యం ప్రభుత్వానికి ఊపిరి, ఆత్మగా నిలిచాయి. 2014లో నరేంద్ర మోదీ దేశ ప్రధాని అయ్యేనాటికి దేశంలో 70 కోట్ల మందికి తమ ఇళ్లలో బ్యాంకు ఖాతాలు లేవన్నారు. శ్రీ నరేంద్ర మోదీ జన్ ధన్ యోజనను ప్రారంభించి, బ్యాంకు ఖాతాలను తెరిచేందుకు ఒక ప్రచారాన్ని ప్రారంభించారు, దీని ఫలితంగా 52 కోట్ల బ్యాంకు ఖాతాలు తెరుచుకున్నాయి, వీటిలో 70 శాతం బ్యాంకు ఖాతాలు మహిళల పేరిట తెరుచుకున్నాయి. భారతదేశంతో సంబంధం ఉన్న వ్యక్తులు మహిళలను బలహీనులు అని పిలిచే తప్పు చేయరని ఆయన అన్నారు.

నేడు దేశంలో మహిళా సాధికారత జరిగిందని, అన్ని పథకాల డబ్బు నేరుగా మహిళల బ్యాంకు ఖాతాల్లోకి వెళ్తోందని కేంద్ర హోం, , సహకార శాఖ మంత్రి అన్నారు. ఐదు దశాబ్దాలకు పైగా దేశాన్ని పాలించిన ప్రతిపక్ష పార్టీ హయాంలో దేశంలో 11 కోట్ల కుటుంబాలకు మరుగుదొడ్లు లేవన్నారు. పేదరిక నిర్మూలన కోసం నినాదాలు హోరెత్తినా పేదలకు ఎలాంటి ఏర్పాట్లు చేయలేదని విమర్శించారు. ఇంట్లో మరుగుదొడ్డి లేనప్పుడు చిన్న కూతురు, సోదరి, తల్లి ఎక్కువగా ఇబ్బంది పడతారని , ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ తొలి ఐదు సంవత్సరాలలో 11.72 కోట్ల మరుగుదొడ్లను అందించడంతో తల్లులు, అక్కాచెల్లెళ్లు, కూతుళ్ల కు సాధికారత లభించిందని పేర్కొన్నారు. దేశంలోని 10 కోట్ల కుటుంబాలు పొగలో బతకాల్సి వస్తోందని, అయితే ప్రధాని నరేంద్ర మోదీ 10 కోట్ల ఇళ్లకు ఉచిత ఎల్పీజీ కనెక్షన్లు ఇవ్వడం ద్వారా మహిళలకు సాధికారత కల్పించారని అన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం మూడు కోట్ల మందికి పైగా మహిళల పేర్లపై ఇళ్లను అందించినట్టు చెప్పారు. దేశంలో 12 కోట్ల ఇళ్లకు తాగునీరు లేదని, వాటికి కుళాయి నీటిని నరేంద్ర మోదీ అందించారని అమిత్ షా చెప్పారు. ః

దేశంలోని 80 కోట్ల మంది ప్రజలకు ప్రధాని నరేంద్ర మోదీ ఒక్కొక్కరికి నెలకు ఐదు కిలోల ఉచిత ఆహార ధాన్యాలను అందించారని తెలిపారు. ప్రధాని మోదీ మూడు కోట్ల 18 లక్షల సుకన్య సమృద్ధి ఖాతాలు తెరిచారని, మాతృవందన్ యోజన కింద 3 కోట్ల మంది మహిళలకు ప్రయోజనాలు కల్పించారని, సుమారు 26 వారాల ప్రసూతి సెలవులు ఇచ్చారని తెలిపారు.

ప్రస్తుతం ప్రపంచవ్యాప్తంగా మహిళా పైలట్ల సంఖ్య ఐదు శాతం ఉండగా, భారత్ లో అది 15 శాతంగా ఉందని, దీనిని సాధికారత అంటారని శ్రీ షా అన్నారు.

పురుషుల కంటే మహిళలే ఎక్కువ సాధికారత కలిగి ఉన్నారని, నిర్ణయాలు, విధాన నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యానికి ఈ బిల్లు దోహదపడుతుందని కేంద్ర హోం, , సహకార శాఖ మంత్రి అన్నారు. సామాజిక వ్యవస్థలోని లోపాలను సరిదిద్దడానికి, మహిళల భాగస్వామ్యాన్ని పెంచడానికి, వారిని గౌరవించడానికి ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ నేతృత్వంలోని ప్రభుత్వం ఈ బిల్లును తీసుకువచ్చిందని ఆయన అన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ "మహిళల నేతృత్వంలోని అభివృద్ధి" విజన్ ను నెరవేర్చడంలో సభ మొత్తం ఏకగ్రీవంగా, ఐక్యంగా ఉన్నట్టు ప్రపంచానికి సందేశం ఇవ్వడానికి ఈ రోజు మనకు ఒక అవకాశం లభించిందని తెలిపారు.

మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకురావడానికి గత ప్రభుత్వాలు నాలుగుసార్లు ప్రయత్నించాయని అమిత్ షా చెప్పారు. 1996లో దేవెగౌడ నేతృత్వంలోని ప్రభుత్వం తొలిసారి మహిళా రిజర్వేషన్ బిల్లును తీసుకొచ్చిందని, ఆ తర్వాత సీమా ముఖర్జీ నేతృత్వంలోని కమిటీకి ఇచ్చిందన్నారు. 'కమిటీ కూడా తన నివేదిక ఇచ్చింది కానీ ఆ బిల్లు ఈ సభకు చేరలేదు.

ఆ తర్వాత 1998లో అటల్ బిహారీ వాజ్ పేయి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే ప్రతిపక్షాలు ఈ బిల్లును సభలో ప్రవేశపెట్టడానికి అనుమతించలేదు' అని గుర్తు చేశారు.

మన్మోహన్ సింగ్ నేతృత్వంలోని ప్రభుత్వం మళ్లీ రాజ్యసభలో సవరణ బిల్లును తీసుకువచ్చిందని, అక్కడ అది ఆమోదం పొందినా తర్వాత ఈ బిల్లు లోక్ సభలోకి రాలేకపోయిందని ఆయన అన్నారు.

ఈ కొత్త ఆరంభం ద్వారా రాజ్యాంగాన్ని సవరించి మహిళా శక్తికి రిజర్వేషన్లు కల్పించడానికి సభ్యులందరూ ఏకగ్రీవంగా పనిచేయాలని కేంద్ర హోం మంత్రి కోరారు. ప్రస్తుత నిబంధన ప్రకారం, పార్లమెంటుకు ఎన్నికయ్యే మూడు కేటగిరీల– జనరల్ (ఇందులో ఒబిసి), షెడ్యూల్ కులాలు, షెడ్యూల్డ్ తెగల సభ్యులలో మహిళలకు మోదీ ప్రభుత్వం 33 శాతం రిజర్వేషన్లు కల్పించారని తెలిపారు.

ఈ రాజ్యాంగ సవరణ కింద ఆర్టికల్ 330 (ఎ), ఆర్టికల్ 332 (ఎ) ద్వారా మహిళా రిజర్వేషన్లు కల్పించినట్లు ఆయన తెలిపారు. వీటితో పాటు మూడు కేటగిరీల్లో వర్టికల్ రిజర్వేషన్ కల్పించి మూడింట ఒక వంతు సీట్లను మహిళలకు కేటాయించారు. డీలిమిటేషన్ కమిషన్ అనేది మన దేశ ఎన్నికల ప్రక్రియను నిర్ణయించే ఒక ముఖ్యమైన సంస్థ చట్టపరమైన నిబంధన అని, ఇది నియామకం ద్వారా జరుగుతుందని, కానీ పాక్షిక న్యాయపరమైన చర్యలు ఉన్నాయని శ్రీ షా అన్నారు. దీనికి సుప్రీంకోర్టు రిటైర్డ్ జడ్జి నేతృత్వం వహిస్తారని, ఇందులో ఎన్నికల సంఘం ప్రతినిధి కూడా ఉంటారని చెప్పారు. రిజర్వు చేయాల్సిన మూడింట ఒక వంతు సీట్లను డీలిమిటేషన్ కమిషన్ ఎంపిక చేస్తుందని చెప్పారు.కమిషన్ ప్రతి రాష్ట్రానికి వెళ్లి బహిరంగ విచారణలు జరిపి పారదర్శకంగా పాలసీని నిర్ణయిస్తుంది. డీలిమిటేషన్ కమిషన్ తీసుకురావడం వెనుక ఉన్న ఏకైక లక్ష్యం పారదర్శకత తీసుకురావడమేనని ఆయన అన్నారు. ఈ కమిషన్ ఏర్పాటులో ఎలాంటి జాప్యం జరగదని, ఎన్నికల తర్వాత జనాభా గణన, డీలిమిటేషన్ రెండూ జరుగుతాయని, త్వరలోనే మూడింట ఒక వంతు మహిళా ఎంపీలు ఈ సభలో కూర్చొని దేశ భవిష్యత్తును నిర్ణయించే రోజు వస్తుందని ఆయన అన్నారు.

దేశ ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ వెనుకబడిన తరగతుల సంక్షేమానికి మనస్ఫూర్తిగా కృషి చేశారని శ్రీ అమిత్ షా అన్నారు. 2014లో ప్రధాని నరేంద్ర మోదీ తన తొలి ప్రసంగంలో తమది దళితులు, వెనుకబడిన తరగతులు, గిరిజనులు, మహిళల ప్రభుత్వమని చెప్పారని గుర్తు చేశారు.

దేశంలోని 80 కోట్ల మంది పేదలకు ఇళ్లు, మరుగుదొడ్లు, విద్యుత్, నీరు, మందులు, గ్యాస్ సిలిండర్లు, ఆహార ధాన్యాలు అందించిన నరేంద్ర మోదీ ప్రభుత్వం ఇప్పుడు మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు తీసుకొచ్చిందని అన్నారు. ప్రతిపక్షాలు ఎన్నడూ ఓబీసీని ప్రధానిని చేయలేదని ఆయన అన్నారు. ప్రతి ఒక్కరూ పార్టీ రాజకీయాలకు అతీతంగా ఈ బిల్లుకు మద్దతివ్వాలని కేంద్ర హోం మంత్రి కోరారు.

## 'ఇంటర్ నేశనల్ లాయర్స్ కాన్ఫరెన్స్ 2023' ను సెప్టెంబర్ 23 వ తేదీ న న్యూఢిల్లీ లో ప్రారంభించనున్న ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:'ఇంటర్ నేశనల్ లాయర్స్ కాన్ఫరెన్స్ 2023' ను 2023 సెప్టెంబర్ 23 వ తేదీ న ఉదయం 10 గంటల వేళ కు న్యూ ఢిల్లీ లోని విజ్ఞాన్ భవన్ లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించనున్నారు. ఈ సందర్భం లో ప్రధాన మంత్రి సభికుల ను ఉద్దేశించి ప్రసంగిస్తారు.

" న్యాయాన్ని అందించే వ్యవస్థ లో సరిక్రొత్త గా ఉనికి లోకి వస్తున్న సవాళ్ళు' అనే ఇతివృత్తం పై 'ఇంటర్ నేశనల్ లాయర్స్ కాన్ఫరెన్స్ 2023' ను బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా నిర్వహిస్తోంది. దీనిని 2023 సెప్టెంబర్ 23 వ మరియు 24 వ తేదీల లో నిర్వహించనున్నారు. వివిధ చట్ట విషయాల పైన అర్థవంతమైనటువంటి సంభాషణల కై మరియు చర్చల కై ఒక వేదిక ను అందుబాటులోకి తీసుకు రావడం సమ్మేళనం యొక్క ఉద్దేశ్యం గా ఉంది. ఈ సందర్భం లో జాతీయం గా మరియు అంతర్జాతీయంగా ప్రాముఖ్యం ఉన్నటువంటి అనేక చట్ట సంబంధి అంశాల ను చర్చించడం జరుగుతుంది. ఆలోచనల ను మరియు అనుభవాల ను వెల్లడించడం తో పాటు గా చట్ట సంబంధి అంశాల పైన అంతరాజాతీయ సహకారాన్ని మరియు అవగాహన ను పటిష్టం చేయడం జరుగుతుంది. దేశం లో మొట్టమొ దటిసారి గా నిర్వహిస్తున్నటువంటి ఈ సమావేశాలలో ప్రస్తుతం ఉనికి లోకి వస్తున్న చట్ట సరళులు, సరిహద్దుల కు ఆవల వ్యాజ్యాల లో సవాళ్ళు, చట్టాని కి సంబంధించినటువంటి సాంకేతిక విజ్ఞానం, పర్యావరణ సంబంధి చట్టం వగైరా విషయాల ను ఈ సమావేశం లో చర్చించడం జరుగుతుంది.



# అల్ఫోర్స్‌లో ఘనంగా శ్రీమహాలక్ష్మి హోమం



కరీంనగర్, సెప్టెంబర్ 22:(నేటి నిజం ప్రతినిధి): శ్రీమహాలక్ష్మి హోమం చేయడం వలన లోకం సుభిక్షంగా ఉంటుందని, సుఖ సంతోషాలు కలుగుతాయని అల్ఫోర్స్ విద్యా సంస్థలు అధినేత డా.వి.నరేందర్ రెడ్డి తెలిపారు. స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ విద్యా సంస్థల కేంద్ర కార్యాలయంలో శ్రీ విఘ్నేశ్వర నవరాత్రి ఉత్సవాల సందర్భంగా ఏర్పాటు చేసిన శ్రీ మహాలక్ష్మి హోమం మరియు కుంకుమ పూజను వేదమంత్రాల మధ్య శ్రీ మహాలక్ష్మి, మాతకు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలను నిర్వహించి జ్యోతిప్రజ్వలన గావించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీ వినాయకుని పూజతో పాటు అష్టలక్ష్మి మాత పూజా కైంకర్యాలను చేయడం వలన ఎన్నో లాభాలు చేకూరుతాయని మరియు సకల పాపాల నుండి విముక్తి పొందవచ్చని తెలుపుతూ ప్రతి ఒక్కరు భక్తి భావాన్ని పెంపొందించుకోవాలని మరియు పూజలు చేసి లోకకళ్యాణార్థమై పలు కార్యక్రమాలను కుడా చేపట్టి ముందంజలో ఉండాలని చెప్పారు. కుంకుమ పూజ మహిళలకు చాలా విశిష్టమైనదని సౌభాగ్యం కల్గిస్తుందని పేర్కొన్నారు. ఉపవాసంతో పూజ చేయడంలో కోరిన కోర్కెలు తీరుతాయని తెలిపారు.ప్రతి సంవత్సరంలాగే ఈ సంవత్సరం కూడా వేదబ్రహ్మణుల సలహాలు, సూచనలు పాటిస్తూ నవరాత్రుల్లో స్వామివారికి ప్రీతికరమైన పూజలను చేస్తున్నామని తెలుపుతూ ప్రతి ఒక్కరు భక్తిశ్రద్ధలతో నియమనిభంధనలు పాటించి ముక్తికి మార్గాన్ని పొందాలని కోరారు. నవరాత్రోత్సవాల సందర్భంగా నేడు మహా లక్ష్మిమాత పూజను వివిధ ద్రవ్యాలతో ఆచరించి ఆ అమ్మవారి ఆశీస్సులు లోకం మీద ఉండాలని ఘనంగా నిర్వహించడం జరిగినదని వివరించారు. ధర్మాన్ని పాటిస్తూ, దయతో మెదులుతూ ఆ దేవుని ఆశీస్సులను పుష్కలంగా పొందాలని కోరారు. కుంకుమ పూజలో భాగంగా ఉపాధ్యాయురాళ్ళు దేవిశ్లోకాలను పఠించి భక్తి భావాన్ని అధ్యాత్మిక వాతావరణన్ని పెంపొందించారు. ఈ కార్యక్రమంలో వివిధ క్యాంపెస్లకు చెందిన ప్రిన్సిపాల్స్, సుమారు రెండు వందల మంది సువాసినిలు అధిక సంఖ్యలో సాముహికంగా నిర్వహించారు. పూజానంతరం తీర్థప్రసాదాలను వితరణ చేసి అన్నదానం చేశారు.

# 10 సంవత్సరాలకు ప్రతిష్టాత్మకమైన డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపును సాధించిన నేషనల్ మెడికల్ కమిషన్

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:ప్రతిష్టాత్మక వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డబ్ల్యూఎఫ్ఎంఈ) గుర్తింపును భారతదేశ నేషనల్ మెడికల్ కమిషన్ పదేళ్లకాలానికి సాధించింది. వైద్య విద్య మరియు అక్రిడిటేషన్‌లో అత్యున్నత ప్రమాణాల పట్ల ఎన్ఎంసికి ఉన్న తిరుగులేని నిబద్ధతకు ఈ గుర్తింపు నిదర్శనం.

ఈ గుర్తింపులో భాగంగా భారతదేశంలో ఉన్న అన్ని 706 మెడికల్ కాలేజీలు డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు పొందుతాయి మరియు రాబోయే 10 సంవత్సరాలలో ఏర్పాటు చేయబోయే కొత్త మెడికల్ కాలేజీలు స్వయంచాలకంగా డబ్ల్యూఎఫ్ ఎంఈ గుర్తింపు పొందుతాయి. ఈ గుర్తింపు భారతదేశంలోని వైద్య విద్య యొక్క నాణ్యత మరియు ప్రమాణాలను గ్లోబల్ బెస్ట్ ప్రాక్టీసెస్ మరియు బెంచ్‌మార్క్‌లతో సమలేఖనం చేయడం ద్వారా మరింత మెరుగుపరుస్తుంది.

యునైటెడ్ స్టేట్స్, కెనడా, ఆస్ట్రేలియా మరియు న్యూజిలాండ్ వంటి డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు అవసరమయ్యే ఇతర దేశాలలో పోస్ట్ గ్రాడ్యుయేట్ శిక్షణ మరియు అభ్యాసాన్ని కొనసాగించడానికి భారతీయ వైద్య గ్రాడ్యుయేట్‌లను ఈ గుర్తింపు అనుమతిస్తుంది. ఇది భారతీయ వైద్య పాఠశాలలు మరియు నిపుణుల అంతర్జాతీయ గుర్తింపు మరియు ఖ్యాతిని పెంచుతుంది. విద్యాపరమైన సహకారాలు మరియు మార్పిడిని సులభతరం చేస్తుంది. వైద్య విద్యలో నిరంతర అభివృద్ధి మరియు ఆవిష్కరణలను ప్రోత్సహిస్తుంది అలాగే వైద్య అధ్యాపకులు మరియు సంస్థలలో నాణ్యత హామీ సంస్కృతిని ప్రోత్సహిస్తుంది.

డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపును ఎన్ఎంసి పొందడంతో భారతీయ విద్యార్థులందకు ఫారిన్ మెడికల్ ఎడ్యుకేషన్ మరియు యునైటెడ్ స్టేట్స్ మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్‌పై ఎడ్యుకేషన్ కమిషన్‌కు దరఖాస్తు చేసుకోవడానికి అర్హత లభిస్తుంది.

ఈ ల్యాండ్‌మార్క్ అచీవ్‌మెంట్‌పై ఎన్ఎంసిలోని ఎథిక్స్ అండ్ మెడికల్ రిజిస్ట్రేషన్ బోర్డు సభ్యుడు మరియు మీడియా విభాగం అధిపతి డాక్టర్ యోగేందర్ మాలిక్ మాట్లాడుతూ "భారతదేశంలో వైద్య విద్య యొక్క నాణ్యత ప్రపంచ ప్రమాణాలకు కట్టుబడి ఉందని డబ్ల్యూఎఫ్ఎంఈ గుర్తింపు స్పష్టం చేసింది. ఈ ప్రశంసలు మన విద్యార్థులకు మరిన్ని అవకాశాలను కల్పిస్తాయి. ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు పొందిన మన ప్రమాణాల కారణంగా భారతదేశాన్ని అంతర్జాతీయ విద్యార్థులకు ఆకర్షణీయమైన గమ్యస్థానంగా మార్చడం తోపాటు ప్రపంచంలో ఎక్కడైనా తమ కెరీర్‌ను కొనసాగించేందుకు అవకాశం ఉంటుంది" అని తెలిపారు.

వరల్డ్ ఫెడరేషన్ ఫర్ మెడికల్ ఎడ్యుకేషన్ (డబ్ల్యూఎఫ్ఎంఈ) అనేది ప్రపంచవ్యాప్తంగా వైద్య విద్య నాణ్యతను పెంపొందించడానికి అంకితమైన ప్రపంచ సంస్థ. డబ్ల్యూఎఫ్ఎంఈ యొక్క అక్రిడిటేషన్ కార్యక్రమం వైద్య సంస్థలు విద్య మరియు శిక్షణ యొక్క అత్యున్నత అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా ఉండేలా మరియు సమర్థించేలా చేయడంలో కీలక పాత్ర పోషిస్తుంది.

నేషనల్ మెడికల్ కమిషన్ (ఎన్ఎంసి) అనేది వైద్య విద్య మరియు అభ్యాసాన్ని పర్యవేక్షిస్తున్న భారతదేశపు ప్రధాన నియంత్రణ సంస్థ. హెల్త్‌కేర్ ఎడ్యుకేషన్‌లో అత్యున్నత ప్రమాణాలను నిలబెట్టడానికి కట్టుబడి ఉన్న ఎన్ఎంసి దేశవ్యాప్తంగా నాణ్యమైన వైద్య విద్య మరియు శిక్షణను అందజేస్తుంది.

# బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల కోసం ప్రార్ధనలు చేయండి

**–హజ్ సొసైటీలకు, ముస్లిం ఉద్యోగులకు, వివిధ రంగాల బాధ్యులకు పవిత్ర జంజం నీటి క్యాన్లను పంపిణీ చేసిన గులాం అహ్మద్ హుస్సేన్...**

**–దేశంలోనే రెండవసారిగా కరీంనగర్ లో 50 క్యాన్ల పంపిణీ**



కరీంనగర్, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): దేశంలోనే రెండవసారిగా కరీంనగర్ పట్టణంలో ఎంఐఎం కార్యాలయం దారుస్సలాంలో పలు ముస్లిం మత పెద్దలకు, సంఘాల, వివిధ జమాత్ లకు, స్వచ్ఛంద సంస్థలకు, ముస్లిం ఉద్యోగ సంఘాల ప్రతినిధులకు, వివిధ రంగాల బాధ్యులకు, ఎంఐఎం నగర అధ్యక్షుడు, తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడు సయ్యద్ గులాం అహ్మద్ హుస్సేన్ ఆధ్వర్యంలో సౌదీ ఎయిర్ లైన్స్ ద్వారా మక్కా నుండి ప్రత్యేకంగా తెప్పించిన పవిత్ర జంజం నీటి ఐదు లీటర్ల దాదాపు 50క్యాన్లను శుక్రవారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఎంఐఎం నగర అధ్యక్షుడు గులాం అహ్మద్ హుస్సేన్ మాట్లాడుతూ, బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, తనపై అపారమైన నమ్మకంతో తెలంగాణ రాష్ట్ర హజ్ కమిటీ సభ్యుడిగా అవకాశం కల్పించారని, ఈనేపథ్యంలో ఈరోజు కరీంనగర్ లో పవిత్రమైన జంజం నీటి క్యాన్లను పంపిణీ చేసే భాగ్యం కల్పించిన ఒదుకు, ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీకి కృతజ్ఞతలు తెలిపారు. నగరంలోని వికలాంగుల యూనియన్, పండ్ల వ్యాపారులకు, లబ్బయిక్, కరీంనగర్ హజ్ సొసైటీలకు, పిటిపి, ప్లంబర్, ఎలక్ట్రిషన్ అసోసియేషన్ లకు, ముస్లిం పోలీసులకు, ఆబ్కారీ, పోస్టల్, బిఎస్ఎన్ఎల్, ఎన్పిడిసిల్, సెకండ్ హ్యాండ్ టూ వీలర్ అసోసియేషన్, ఎంఐఎం నూతన డివిజన్ల అధ్యక్షుల కు, టౌన్ ఎంఐఎం కమిటీ, సున్నీ మర్కజీ మిలాద్ కమిటీ, దారుస్సలాం ఆఫీస్ స్టాఫ్ కు ఇలా మొత్తం 50 రంగాలకు సంబంధించిన బాధ్యుల కు 5లీటర్ల 50 క్యాన్ల పవిత్ర జంజం జలాన్ని అందజేశారు. ముఫ్తి ఘుఫ్రాన్ పవిత్ర జంజం నీటి చారిత్రక ప్రాముఖ్యతను వివరించారు. ఈసందర్భంగా ఎంఐఎం పార్టీ అగ్రనేతలైన బారిష్టర్ అసదుద్దీన్ ఒవైసీ, అక్బరుద్దీన్ ఒవైసీల కోసం ప్రత్యేక ప్రార్ధనలు చేయాలని గులాం అహ్మద్ అందరినీ కోరారు. ప్రపంచ ప్రఖ్యాత మక్కా నగరంలోని క్లాక్ టవర్ సెక్రెటరీ అబూ బకర్ అక్బర్ చేతుల మీదుగా పవిత్ర జంజం నీటిని అందరికి పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో జమాతే ఇస్లామి జిల్లా అధ్యక్షుడు షోయబ్ అహ్మద్ ఖాన్, మాజీ డిప్యూటీ మేయర్ అబ్బాస్ సమి, బర్కత్ అలీ, హాఫిజ్ సయ్యద్ మొయిజుద్దీన్ ఖాద్రి, ఇబ్రహీం, ఖాజా, ఖమరుద్దీన్, నాయకులు అలిబాబా, అజర్ దబీర్, పెద్దపల్లి నేత ఇమ్రాన్ అడ్వకేట్ తదితరులు పాల్గొన్నారు.

# వైమానిక దళ సంఘం వార్షికోత్సవం




న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:వైమానిక దళ సంఘం (ఏఎఫ్ఏ) ఈ రోజు 43వ వార్షికోత్సవం జరుపుకుంది. వైమానిక దళ సంఘం అధ్యక్షుడు, ఎయిర్ చీఫ్ మార్షల్ (విశ్రాంత) ఆర్‌కేఎస్ భదౌరియా, ఈ రోజు ఉదయం. ఏఐఎఫ్ విశ్రాంత ఉద్యోగుల తరపున జాతీయ యుద్ధ స్మారకం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి, అమర వీరులకు నివాళులు అర్పించారు. ఆ తర్వాత, న్యూఢిల్లీలోని సుబ్రొతో పార్క్‌లోని వైమానిక దళ ఆడిటోరియంలో వార్షిక సర్వసభ్య సమావేశం (ఏజీఎం) జరిగింది.

ఏజీఎమ్‌కు ముఖ్య అతిథిగా హాజరైన చీఫ్ ఆఫ్ ఎయిర్ స్టాఫ్ (సీఏఎస్), ఎయిర్ చీఫ్ మార్షల్ వీఆర్ చౌదరి, విశ్రాంత ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగించారు. గత ఒక సంవత్సర కాలంలో వైమానిక దళం సాధించిన విజయాలు, రాబోయే సంవత్సరాల ప్రణాళికల గురించి వివరించారు. అనుభవజ్ఞుల ధైర్యసాహసాలు, కృషి, త్యాగాన్ని సీఏఎస్ ప్రశంసించారు. ఏఎఫ్ఏ కోసం కోసం అంకితమైన ముగ్గురు అత్యుత్తమ విశ్రాంత అధికారులను సీఏఎస్ సత్కరించారు. ఏఎఫ్ఏ అభివృద్ధికి కృషి చేసిన వారిని కూడా ఆయన సన్మానించారు.

వైమానిక దళ సంఘం ఒక ప్రభుత్వేతర సంక్షేమ సంస్థ. వైమానిక దళ విశ్రాంత అధికార్లు, వారి కుటుంబాల సంక్షేమ కార్యక్రమాలు చేపడుతుంది. భర్తలను కోల్పోయిన మహిళలు, నిరుపేద పిల్లలకు ఆర్థికంగా సాయం చేస్తోంది. 1980 సెప్టెంబర్ 15న, మార్షల్ ఆఫ్ ది ఎయిర్ ఫోర్స్ అర్జన్ సింగ్ డీఎఫ్‌సీ ఆధ్వర్యంలో ఈ సంస్థాన్ని స్థాపించారు. దీనికి దేశవ్యాప్తంగా ఇరవై శాఖలు ఉన్నాయి. యూకే, ఆస్ట్రేలియాలోనూ రెండు శాఖలు ఉన్నాయి. దాదాపు 92,141 వైమానిక దళ విశ్రాంత సిబ్బంది, 6,190 జీవిత భాగస్వాములు ఇందులో సభ్యులుగా ఉన్నారు.

# 'బహిరంగ విఫణి ద్వారా అమ్మకం పథకం' (దేశీయ) కింద 13 ఈ-వేలాల్లో 18.09 ఎల్ఎంటీ గోధుమలు విక్రయించిన కేంద్రం

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 22:దేశంలో గోధుమలు, గోధుమ పిండి చిల్లర ధరలను నియంత్రించేందుకు భారత ప్రభుత్వం తీసుకుంటున్న చొరవలో భాగంగా, భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ), 'బహిరంగ విఫణి ద్వారా అమ్మకం పథకం' (దేశీయ) ఓఎంఎస్ఎస్(డి)రి కింద వారంవారీ ఈ-వేలం ద్వారా గోధుమలు అమ్ముతోంది. క్వింటాల్‌కు రూ.2125/- రిజర్వ్ ధర చొప్పున ఎఫ్‌సీఐ విక్రయిస్తోంది, ప్రస్తుత గోధుమల కనీస మద్దతు ధరకు ఇది సమానం.

దేశవ్యాప్తంగా 480 పైగా కేంద్రాల ద్వారా ప్రతి వారం వేలంలో 2.00 లక్షల మెట్రిక్ టన్నుల గోధుమలను ఎఫ్‌సీఐ అందుబాటులోకి తెస్తోంది. 2023–24 సంవత్సరంలో, 21.09.2023 వరకు మొత్తం 13 ఈ-వేలాలు నిర్వహించింది, 18.09 ఎల్ఎంటీల గోధుమలు విక్రయించింది.

ఈ ఏడాది ఆగస్టులో గోధుమల సగటు అమ్మకపు ధర క్వింటాల్‌కు రూ.2254.71గా ఉంది, 20.09.23న జరిగిన ఈ-వేలంలో ఇది రూ.2163.47కు తగ్గింది. బహిరంగ విఫణిలో గోధుమల ధరలు తగ్గుముఖం పట్టాయని ఇది సూచిస్తోంది. ప్రతి వారం నిర్వహించే ఈ-వేలంలో, నిర్దేశించిన పరిమాణంలో 90% దాటకుండా విక్రయాలు జరుగుతున్నాయి. దేశవ్యాప్తంగా తగినన్ని గోధుమల నిల్వలు ఉన్నాయని ఇది సూచిస్తోంది.

ఓఎంఎస్ఎస్(డి) విధానాన్ని విజయవంతంగా అమలు చేయడం ద్వారా బహిరంగ విఫణిలో గోధుమ ధరలు నియంత్రణలో ఉండేలా కేంద్ర ప్రభుత్వం నియంత్రించింది. 2023–24లో మిగిలిన కాలానికి ఓఎంఎస్ఎస్(డి) కొనసాగించడానికి కేంద్రం వద్ద తగినన్ని గోధుమ నిల్వలు అందుబాటులో ఉన్నాయి.

# సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యం : ఎమ్మెల్యే చిరుమర్తి



నల్గొండ, సెప్టెంబర్ 21: సీఎం కేసీఆర్‌తోనే తెలంగాణ అభివృద్ధి సాధ్యమని నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య అన్నారు. జిల్లాలోని కట్టంగూర్ మండలం రాంచంద్రాపురం గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు 100 మంది బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు నీలం గణేష్, అనంతుల సతీష్ ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే చిరుమర్తి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన ఎమ్మెల్యే వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బీఆర్ఎస్ పార్టీలోనే ప్రతి కార్యకర్తకు సరైన గుర్తింపు లభిస్తుందన్నారు.

పార్టీలో చేరిన వారిలో మహేశ్వరం నగేష్ మాజీ ఎంపిటీసీ, వార్డు సభ్యులు, బొడ్డుపల్లి సైదులు, నందికొండ సైదులు, అనంతుల యాదయ్య, సున్నపు సైదులు, మేడ కిరణ్, మేడ ఇస్తారి, మేడ ఎల్లయ్య బొడ్డుపల్లి మహేష్, బొడ్డుపల్లి కృష్ణయ్య, నందికొండ బుచ్చయ్య, సిల్వేరు గణేష్, సున్నపు నవీన్, కందుల పాపయ్య, చిట్టిమల్ల శంకర్, చౌగోని వెంకన్న తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ తరాల బలరాం, ఎంపీటీసీ నల్లమాధ వీరమ్మ, సర్పంచ్ ప్రియాంక , తదితరులు పాల్గొన్నారు.

# డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీలను ప్రారంభానికి సిద్ధం చేయాలి : జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): గంభీరావు పేట మండల పరిధిలో చేపట్టిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కాలనీల్లో అన్ని మౌలిక సదుపాయాలు కల్పించి, ప్రారంభానికి సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ అనురాగ్ జయంతి ఆదేశించారు. శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో అదనపు కలెక్టర్ ఎన్. ఖీమ్యా నాయక్ తో కలిసి గంభీరావుపేట మండల కేంద్రంలోని ఎస్సీ, బీసీ కాలనీలు, లింగన్నపేట, నర్మాల, కోళ్ళమద్ది గ్రామాల్లో నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల సముదాయాల ప్రారంభానికి చేపట్టాల్సిన చర్యలపై చర్చించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ గంభీరావుపేట మండల కేంద్రంలో బీసీ కాలనీలో 168, ఎస్సీ కాలనీలో 104, లింగన్నపేట గ్రామంలో 50, నర్మాల గ్రామంలో 30, కోళ్ళమద్ది గ్రామంలో 17 డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల నిర్మాణం చేపట్టడం జరిగిందని తెలిపారు. ఈ కాలనీల్లో మౌలిక వసతులు, సదుపాయాల కల్పన పనులు పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. క్లీనింగ్, త్రాగునీటి సరఫరా, విద్యుత్ సదుపాయం, తదితర మైనర్ రిపేర్ పనులు పూర్తి చేయాలని సూచించారు. సంబంధిత అధికారులు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఎక్కడైనా ఇబ్బందులు ఉంటే వెంటనే పరిష్కరించాలని అన్నారు. త్రాగునీరు శాంపిల్ తీసుకుని టెస్టింగ్ చేయాలని, అన్ని బ్లాక్ లకు సక్రమంగా నీటి సరఫరా అవుతుందో లేదో ముందే తనిఖీ చేయాలని మిషన్ భగీరథ అధికారుల ను ఆదేశించారు. కాలనీల్లో ఎవెన్యూ ప్లాంటేషన్ చేయాలని, పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎంపిడీఓ ను ఆదేశించారు.సమావేశంలో ఆర్డీఓ లు ఎన్.ఆనంద్ కుమార్, మధుసూధన్, బి.గంగయ్య, పంచాయితీ రాజ్ ఈఈ సూర్య ప్రకాష్, సెస్ ఎండీ సూర్యచందర్ రావు, జిల్లా సహకార శాఖ అధికారి బుద్ధ నాయుడు, తహాశీల్దార్ భూపతి, ఎంపిడీఓ శ్రీనివాస్, మిషన్ భగీరథ డీఈ ప్రేమ్ చంద్, ఏఈ లు భాస్కర్, నాగరాజు, తదితరులు పాల్గొన్నారు.

# వృద్దురాలిని రక్షించిన బ్లూకోల్ట్ కానిస్టేబుల్



రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబద్ మండల కేంద్రానికి చెందిన పిల్లి చంద్రవ్వ అనే వృద్దురాలు శుక్రవారం చేరువులోకి దూకి ఆతహత్య చేసుకోవడానికి యత్నించగా బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ బాలా శ్రీనివాస్‌శ్రీరక్షించారు. ఈ సందర్భంగా వృద్దురాలు చేరువులోకి దూకెందుకు చూస్తుండగా, సమీప ప్రాంతంలో ఉన్న ఓ వ్యక్తి వెంటనే బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ బాలా శ్రీనివాస్ చేశాడు. వెంటనే స్పందించిన కానిస్టేబుల్ బాలా శ్రీనివాస్

సంఘటన స్థలానికి చేరుకొని సదరు వృద్దురాలిని కాపాడి, ముస్తాబద్ మండల కేంద్రంలోని పీపుల్స్ ఆసుపత్రికి తరలించారు.

అనంతరం ఎస్ఐ శేఖర్ రెడ్డి చంద్రవ్వ కుటుంబ సభ్యులతో కౌన్సిలింగ్ నిర్వహించి, చంద్రవ్వను అప్పగించారు.

సకాలంలో స్పందించి, వృద్దురాలి ప్రాణాలు కాపాడిన ముస్తాబద్ బ్లూ కోల్ట్ కానిస్టేబుల్ బాలా శ్రీనివాస్ ను జిల్లా ఎస్పీ అఖిల్ మహాజన్ అభినందించారు.

# రాజన్నను దర్శించుకున్న టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు




రాజన్న సిరిసిల్ల, సెప్టెంబర్ 22:(నేటినిజం ప్రతినిధి): వేముల వాడ శ్రీ రాజరాజేశ్వరస్వామిని శుక్రవారం టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావుదర్శించుకొని, ప్రత్యేక పూజలు చేశారు.

అనంతరం వారికి అర్చకులు ఆశీర్వచనం గావించి, లడ్డు ప్రసాదము అందజేశారు.

వారి వెంట సింగిల్విండో చైర్మన్ ఏనుగు తిరుపతిరెడ్డి తదితరులు ఉన్నారు.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.